పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు


## ముంపు ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు21:**ఎగువున కురిసిన భారీ వర్షాల కారణంగా వైనతేయి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.చినబాబు అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ. వరదలు కారణంగా గంగలకుర్రు అగ్రహారం, నందంపూడి, మాచవరం, తొండవరం, వాకలగరవు ప్రాంతాలు ఉన్నాయని వాటిని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వారిన సురక్షిత ప్రాంతాలకు తరలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్చార్జి ఎంపీడీఓ ఏపీఎల్.నరసింహం, వీఆర్వోలు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో సీఎం చంద్రబాబు

# పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**కాకినాడ/పెద్దాపురం, పెన్ పవర్,ఆగస్టు 21 :**స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 23న పెద్దాపురం పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, సీఎం టూర్ కోఆర్డినేటర్ పేందుర్తి వెంకటేష్, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, రోడ్డు-భవనాల శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు.కలెక్టర్ బృందం తొలుత పెద్దాపురం%-%జి.రాగంపేట రోడ్డులోని హెలిప్యాడ్ ను పరిశీలించారు. హెలిప్యాడ్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశాన్ని, పీ-4 కోసం గుర్తించిన కొండయ్యపేట గృహాలను కూడా పరిశీలించారు. అనంతరం సామర్లకోట ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న పూర్ణ కళ్యాణ మండపం మరియు ఇతర ప్రదేశాలను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ - "ముఖ్యమంత్రి గారు 23న పెద్దాపురంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, ప్రజావేదిక, పీ-4 వంటి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలి.పర్యటనలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలి" అని అధికారులను ఆదేశించారు.పర్యటన ఏర్పాట్ల సమీక్షలో పెద్దాపురం ఆర్డీవోలు ఎస్. మల్లి బాబు, కె. శ్రీరమణి, పెద్దా పురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, డీఎస్పీ శ్రీహరి రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.







## తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21:** గోదావరి నది పరివాహక ప్రాంతం నుండి ఉధృతంగా వస్తున్న వరద దృష్ట్యా గోదావరి నది తీర ప్రాంత గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.గురువారం స్థానిక మండల పరిధిలోని అప్పనపల్లి కాజు వే వద్ద వరద ఉధృతి పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని కావున తీరప్రాంత ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తం గా ఉంటూ వాతావరణ, స్థానిక అధికారుల హెచ్చరి కలకు అనుగుణంగా సుర క్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. అధికారులు వరద హెచ్చరికలకు అనుగుణం గా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలకు సన్నద్ధం కావాలన్నారు. వరద ఉధృతి పెరిగినట్లయితే కొన్ని ప్రాంతాలలో రహదారులు నీటిలో మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు.తీర ప్రాంత వాసులు అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలే తప్ప అనవసరంగా సంచరించరాదని ఆయన సూచించారు. ముంపుబాధితుల తరలింపు పునరావాస కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు.వరద ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా ఏ గ్రామాలు ముంపు బారిన పడతాయో ఆయా గ్రామాలలో ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల తాహసిల్దార్ సునీల్ కుమార్, మండల ప్రత్యేక అధికారి మరియు డి ఎల్ డి ఓ వేణుగోపాల్ ఇన్చార్జ్ ఎంపీడీవో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆది కర్మయోగి ద్వారా గ్రామాల అభివృద్ధి




**జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 21 :**గిరిజన ప్రాంతంలోని గిరిజనుల గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా ఆది కర్మయోగి ప్రోగ్రాం ద్వారా ఊరి ప్రజలను బాగస్వామినీ చేస్తూ విలేజ్ విజన్ మ్యాప్ మరియు విలేజ్ యాక్షన్ ప్లాన్ ద్వారా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపుహాల్లో ఈనెల 19వ తారీకు నుండి ఈనెల 21వ తారీకు వరకు ఆది కర్మయోగి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులకు మూడు రోజులపాటు శిక్షణ ముగింపు కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్,రంపచోడవరం ఐటీడీఏ కట్టా సింహాచలం ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని గిరిజనులు, గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ల ద్వారా మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లలకు ఆది కర్మయోగి ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. శిక్షణ పొందిన మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు గ్రామస్థాయిలో కొంతమందికి ఆది కర్మయోగి శిక్షణ ఇచ్చి ఎంపిక చేసిన గ్రామాలలో ప్రజల ప్రాధాన్యత ఆధారం గా విద్యా, వైద్యము, త్రాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, రహదారులు తదితరవి గ్రామస్తులతో సమస్యలు తెలుసుకుని విలేజ్ విజన్ మ్యాప్ మరియు యాక్షన్ ప్లాన్ జాబితా తయారుచేసి సమర్పించాలని ఆయన అన్నారు. మనదేశంలో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా ఉద్యోగస్తులు మరియు ఊరు ప్రజలు అందరూ కర్మయోగి గా మారాలి అని ఆయన అన్నారు. ఏజెన్సీలో కింద స్థాయి నుండి పై స్థాయి వరకు ప్రతి గ్రామం, ప్రతి గిరిజనుడు అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఇతర దేశాలకు దీటుగా మన గిరిజన ప్రాంతం అభివృద్ధి చేయుటయే ఆది కర్మయోగి ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతం వందకి 98 శాతం అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఏజెన్సీలో గిరిజన గ్రామాలలో చిన్న చిన్న త్రాగునీటి, సమస్యలు, పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించిన మరమ్మత్తులకు సంబంధించిన వాటిని యాక్షన్ ప్లాన్ ద్వారా జాబితా తయారు చేసి సమర్పించాలని ఆయన అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ఆది కర్మయోగి ప్రోగ్రాం కి సంబంధించిన వివరాలను సంబంధిత గ్రామ ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు. ఆది కర్మయోగి, డి ఏ జూగా, ప్రోగ్రాం ద్వారా సచివాలయాల పరిధిలోగల కార్యదర్శులను, ఏఎన్ఎం లను, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను, డిజిటల్ అసిస్టెంట్లను, ఎన్జీవోలు తదితర సిబ్బంది ఆయా గ్రామాలలో ముందుగా సమస్యలు తెలుసుకొని విజన్ యాక్షన్ ప్లాన్ ద్వారా సమస్యలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో వివిధ రకాలైన సమస్యలు తెలుసుకొని ఆయా గ్రామాలకు సంబంధించిన గిరిజనుల సహాయంతో విజన్ మ్యాప్ తయారు చేయాలని ఆయన అన్నారు. విజన్ మ్యాప్ తయారు చేయుటకు సంబంధిత అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన అన్నారు. గ్రామాలలో విజన్ మ్యాపు తయారుచేసిన అనంతరం ప్రాధాన్యత ప్రకారం గ్రామస్తులతో కలిసికట్టుగా అందరూ కలిసి విజన్ యాక్షన్ ప్లాన్ జాబితా తయారు చేసి సమర్పించాలని ఆయన అన్నారు. 2047 సంవత్సరానికి గిరిజన ప్రాంత గ్రామాలు, గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా ఆది కర్మయోగి, డి ఎ జూగా, ప్రీతి యోగి ప్రోగ్రాం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డివిఎస్వి రమణ. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు జి.శారదా దేవి, చంద్ర కిరణ్, శిరీష, రామం,అచ్యుత్ కిరణ్, ధ్రువకుమార్ అదేవిధంగా అన్ని మండలాల సంబంధించిన ఎంపీడీవోలు, వైద్యాధికారులు, ఇంజనీర్లు, సిడిపివోలు, మండల విద్యాశాఖ అధికారులు. సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ ఐటీ ఆధునీకరణ

### డిజిటల్ సేవల విస్తరణలో ముందంజ

### ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నలకు కేంద్రం




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 21:**ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ సేవల ఆధునీకరణ, డిజిటల్ సేవల విస్తరణలో రాష్ట్రం విశేష పురోగతిని సాధించిందని కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ రాజ్యసభలో తెలిపింది. ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ వివరాలు వెల్లడించారు.ఐటీ మోడర్నైజేషన్ ప్రాజెక్ట్ 2.0 కింద గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో, 2024-25 సహా, ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌కు రూ.67.95 కోట్లు కేటాయించగా, వాటిని పూర్తిగా వినియోగించారు. దీంతో రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు కంప్యూటరైజ్ అవుతూ నెట్‌వర్క్ కనెక్టివిటీ పొందాయి. ఫలితంగా పోస్టల్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ప్రభుత్వ సేవలు డిజిటల్ రూపంలో సులభంగా అందుతున్నాయి. కాకినాడలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) శాఖ ఆర్థిక చేర్పులో ముందంజలో నిలిచింది. 2025%-%26 ఆర్థిక సంవత్సరం జూలై 31 వరకు 2.94 లక్షల డీబీటీ ఖాతాల్లో రూ.186 కోట్లు జమ కాగా, 2018లో ప్రారంభమైనప్పటి నుంచి 5.87 లక్షల ఖాతాలు తెరవబడ్డాయి. ఇప్పటి వరకు రూ.77 కోట్లకు పైగా %లావాదేవీలు జరిగాయి. ఆధార్ అప్‌డేట్, ఇన్సూరెన్స్, లోన్ సదుపాయం, వ్యాపారుల రిజిస్ట్రేషన్ వంటి సేవలను కూడా అందిస్తున్నారు.పార్సిల్ పంపిణీ వ్యవస్థ బలోపేతం కోసం రాష్ట్రంలో 8 నోడల్ డెలివరీ సెంటర్లు, 12 పార్సిల్ హబ్‌లు ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఈ-కామర్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రం స్పష్టం చేసింది.స్టార్టప్ రంగంలో, టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు "ఎంపవరింగ్ టెక్నాలజీ స్టార్టప్స్ %-% 2025" పిలుపు కింద రాష్ట్రం నుంచి వచ్చిన 74 ప్రతిపాదనలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, లబ్ధిదారుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ తెలిపింది.ఈ చర్యలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాలు, సేవల విస్తరణపై కేంద్రం చూపుతున్న ప్రత్యేక దృష్టిని ప్రతిబింబి స్తున్నాయని, ఆధునీకరించిన పోస్టల్ నెట్‌వర్క్, సమగ్ర ఆర్థిక సేవలతో ప్రజలకు నేరుగా లబ్ధి కలుగుతోందని పేర్కొంది.

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా జ్యూట్ బ్యాగులు వాడాలి

**జాయింట్ కలెక్టర్ నిషాంతి**

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21:** ప్రతి నెల మూడవ శని వారం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 8 వ విడత భాగంగా "ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుటకు, రైతు బజార్లలో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్,సంచులు వినియోగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్లాస్టిక్ వ్యర్థాలు మూలంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవకుండా భూగర్భ పై తీవ్రమైన ప్రభావం చూపడంతో పాటు ప్లాస్టిక్ వలన కలిగే కాలుష్య,దుష్ప్రభావాలు నివారించుటకుగాను తగు చర్యలు ప్రత్యామ్నాయంగా చేనేత లేదా జూట్ సంచులు వినియోగించవలసినదిగా ఆదేశిస్తూ రైతులు, వినియోగదారులకు ప్లాస్టిక్ సంచుల నివారణకై విస్తృత ప్రచారం చేస్తూ అన్ని రైతు బజార్లలో బ్యానర్లు ఏర్పాటు చేయవలసినదిగా టి.నిశాంతి, జిల్లా సంయుక్త కలెక్టరు మరియు అదనపు మేజిస్ట్రేట్, కోనసీమ జిల్లా వారు ఆదేశించియున్నారు.రైతు బజార్లలో కూరగాయల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు,డ్రైనేజ్ పరిసరాల పరిశుభ్రతకై తగు చర్యలు తీసుకోవలసినదిగా మార్కెటింగ్ శాఖాధికారులను ఆదేశించారు.



# ఘనంగా బండారు సంజీవ్ పుట్టినరోజు వేడుకలు





కొత్తపేట ,పెన్ పవర్, ఆగస్టు21:తెలుగుదేశం పార్టీ యువనాయకుడు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు గురువారం కొత్తపేటలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలు పండగ వాతావరణాన్ని తలపించాయి.

ప్రత్యేక పూజలు – సేవా కార్యక్రమాలు

ఉదయం శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. సంజీవ్ దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కోసం భక్తిపూర్వకంగా ప్రార్థనలు చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మొక్కలు నాటడం ద్వారా మంచి సందేశాన్ని అందించారు.ఆసుపత్రిలో సేవా కార్యక్రమం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్, పళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులు, వారి కుటుంబ సభ్యులు సంజీవ్ పట్ల కృతజ్ఞతలు తెలిపారు. "సామాజిక సేవ పట్ల ఆసక్తి చూపడం యువతకు ఆదర్శంగా నిలుస్తుంది" అని పలువురు అభిప్రాయపడ్డారు.

తరువాత కొత్తపేట సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంజీవ్ భారీ కేక్ కట్ చేసి ప్రజలతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం సుమారు 200 మంది పేదవారికి అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పేదలు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.సంజీవ్ భవిష్యత్తులో ప్రజానాయకుడిగా ఎదగాలని కోరుకుంటున్నామని వారు అభినందనలు తెలిపారు.




## కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు





కొత్తపేట,పెన్ పవర్, ఆగస్టు21:కొత్తపేట మండలం, అమలాపురం ప్రధాన రహదారి దేగలవారిపాలెం వంతెన వద్ద గుమ్మడి జాన్ విక్టర్ ఆధ్వర్యంలో నిర్మితమైన శ్యామల గార్డెన్స్ కళ్యాణమండపంను గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ కలిసి ఘనంగా ప్రారంభించారు.

గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన వసతులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కళ్యాణమండపాల అవసరం ఎంతగానో ఉందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ఇటువంటి వసతులు ఏర్పడటం ఆనందకరమని తెలిపారు. వ్యాపార అభివృద్ధి జరగాలని, కొత్తగా ప్రారంభించిన ఈ మండపం స్థానికులకు, సమాజానికి మేలు చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మోడేకుర్రు సర్పంచ్ కూడుపూడి రామలక్ష్మి, నాయకులు వెంకటేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ, కంఠంశెట్టి చంటి, తులా రాజు, రెడ్డి శ్రీనివాస్, సరేళ్ల రాజబాబు, సూరవారపు రామకృష్ణ, గోలకోటి సత్తిబాబు, కోట్లపల్లి పండు, అడపా ఆనంద్ తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరంజీవి యువత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు



అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21 :చిరంజీవి యువత ఆధ్వర్యంలో అమలాపురం పరిసర ప్రాంతలలో పద్మవిభూషణ్ డాాఎఎ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన మహోత్సవాలు ఈనెల 15వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు దీనిలో భాగంగా గురువారం స్థానిక రవణం వీధి పార్కు వద్ద"మొక్కలు నాటే కార్యక్రమం" నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెగా అభిమాన సంఘాల నాయకులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లా నాయుడు, వర్రే శేషు, గొర్తి పవన్, నూకల బుల్లి నాయుడు, మేడిశెట్టి శివ, సాధనాల సురేష్, కొత్తూరి వంశీ శృంగవరపు దుర్గాప్రసాద్ మెగాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్పటల్స్, నర్సింగ్ హెూమ్స్ డయోగ్నస్టిక్ ల్యాబ్స్ యాజమాన్యం తో మున్సిపల్ కమీషనర్ సమీక్షా సమావేశం






అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21: మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేట్ హాస్పటల్స్, నర్సింగ్ హెూమ్స్, డయోగ్నస్టిక్ ల్యాబ్స్ యజమానులతో అమలాపురం మున్సిపల్ కమీషనరు వి.నిర్మల్ కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్భహించి, హాస్పిటల్స్ నందు బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ,హాస్పటల్ పరిసరాలలో పరిశుభ్రత మరియు పారిశుధ్య నిర్వహణ తప్పని సరిగా పాటించాలని తెలియజేశారు.బయో–మెడికల్ వ్యర్థాల నిర్వహణ నియమాలు %–% 2016 ప్రకారం అన్ని హాస్పటల్స్,ల్యాబ్స్ వారు బయో మెడికల్ వ్యర్థాలను ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఏజెన్సీలకు మాత్రమే అందజేయాలని,ఎట్టి పరిస్థితులలోను మున్సిపల్ వ్యర్థాలతో కలిపకూడదని, బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో పాటు కలిపి అందజేస్తే ఆయా హాస్పటల్స్ పై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని కమీషనర్ వి.నిర్మల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. హాస్పటల్ పరిసరాలు,ప్రతి వార్డు,మరుగు దొడ్లు పరిశుభ్రంగా ఉండేటట్లు ప్రతిరోజు చర్యలు తీసుకోవాలని, రోగులకు,వారి వెంట వచ్చే సహాయకులకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందజేయాలని కమీషనర్ తెలియజేశారు.పట్టణంలోని అన్ని హాస్పటల్స్ మరియు ల్యాబ్స్ వారు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని,వాటిని ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా హాస్పటల్స్ యజమానులు, డాక్టర్లు మార్గదర్శులుగా చేరి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి చేయూతనందించాలని పిలుపునిచ్చారు.దీనికి హాస్పటల్స్ యజమానులు, డాక్టర్లు పూర్తి సహకారం అందిస్తామని,ఈ కార్యక్రమానికి మద్ధతు ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిద హాస్పటల్స్ యాజమాన్యం,డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా కొరతపై స్పందించిన స్పీకర్



నర్సీపట్నం, పెన్ పవర్ ( ఆగస్టు 21) :నర్సీపట్నం నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్యపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సత్వర చర్యలు చేపట్టారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పీకర్ స్వయంగా సమగ్ర విచారణ జరిపి నిజంగానే యూరియా కొరత ఉన్నట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ జిల్లా అధికారులను సంప్రదించి పరిస్థితులపై వివరాలు సేకరించారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫోన్ చేసి, అనకాపల్లి జిల్లాకు అత్యవసరంగా అదనంగా 3,000 టన్నుల యూరియా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కూడా ఈ సమస్యపై స్పీకర్ మాట్లాడారు.

ఈ చర్యల ఫలితంగా త్వరలోనే రైతులకు అవసరమైనంత యూరియా జిల్లాకు రానుందని, రైతుల సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు రైతులకు భరోసా ఇచ్చారు. ఇక యూరియా ధరపై కూడా ప్రత్యేకంగా స్పందించిన ఆయన, అసలు ధర కంటే 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇటువంటి అక్రమాలు జరిగితే రైతులు వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న నర్సీపట్నం రైతులకు త్వరలోనే ఊరట లభించబోతోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు.

## యాక్సిడెంట్ లో మృతిచెందిన జనసేన కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించిన జనసైనికులు





తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 21:పెద్దేవం గ్రామానికి చెందిన గుండెపల్లి మణి శంకర్ రాఖీ పూర్ణిమ రోజున తన సోదరితో రాఖీ కట్టించుకోవడానికి వెళ్లే క్రమంలో వెంకటాయపాలెం సమీపంలో బైక్ యాక్సిడెంట్ లో మృతి చెందాడు. కుమారుని మరణ వార్త విని తన తండ్రి జీర్ణించుకోలేక గుండెపల్లి శ్రీను ఇంటి వద్ద మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ తాళ్ళపూడి మండల అధ్యక్షులు గంటా కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా గంటా కృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జనసేన పార్టీ తరపున ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. జనసేన పార్టీ తరపున అందవలసిన సహకారం అందేలా చూస్తానని, వెంటనే మంత్రి నాదెండ్ల మనోహర్ క్యాంపు కార్యాలయంలో ఈ విషయాన్ని తెలిపారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు పి.కె.రంగారావు, కాపవరం సొసైటీ అధ్యక్షులు సుంకర సత్తిబాబు, ఏఎంసీ డైరెక్టర్ కొప్పాక విజయ్ కుమార్, బీజేపీ నాయకులు పెరుగు పోతురాజు, వీరుమళ్ల నారాయణ, సిద్దంశెట్టి స్వామి, నామన చిన్న బూరయ్య, దేవన సత్యనారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## బండారులంక పిఏసిఎస్ అధ్యక్షులుగా సూర్య





అమలాపురం రూరల్ పెన్ పవర్ ఆగస్టు 21 :బండారులంక పిఏసిఎస్ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన కండిబోయిన సూర్య డైరెక్టర్లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ జడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మి నారాయణ,అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు,చింతా శంకరమూర్తి, మాడ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవటం లో పొదల కప్పు కరెంట్ ట్రాన్స్ఫార్మర్ - గ్రామస్తుల్లో భయం



కాజులూరు, పెన్ పవర్, ఆగస్టు 21 :ఆర్యవటం గ్రామంలో కరెంట్ ట్రాన్స్ఫార్మర్ పై పచ్చని పొదలు, తీగలు పూర్తిగా కప్పేసి ప్రమాదానికి దారి తీస్తున్నాయి. ఆ ట్రాన్స్ఫార్మర్ నుంచి గ్రామంలోని దాదాపు 30 ఇళ్లకు విద్యుత్ సరఫరా జరుగుతోంది.ఎండకు తగలకుండా, వర్షానికి తడవకుండా ట్రాన్స్ఫార్మర్ ను పొదలు కవచంలా చుట్టుకున్నా – అదే ఇప్పుడు గ్రామస్తుల ప్రాణాలకు ముప్పుగా మారింది. రోడ్డు మీదుగా వెళ్లేవారు ఆ పొదల ఆకులపై అనుకోకుండా తగిలితే ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చినా, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.అదీ కాకుండా ఈ సమస్య ఉన్న ట్రాన్స్ఫార్మర్ ఆర్యవటం విద్యుత్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉండటం విశేషం. ప్రతి శుక్రవారం విద్యుత్ శాఖ పవర్ కట్ చేసి లైన్లకు అనుకున్న చెట్లు, కొమ్మలు,పొదలు తొలగిస్తున్నామని పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నా %–% ఇలాంటివి గమనించక పోవడం పై గ్రామస్తులు మండిపడు తున్నారు.గ్రామంలో విద్యుత్ సమస్యను తక్షణం పరిష్కరించి, ట్రాన్స్ఫార్మర్ పై ఉన్న పొదలు తొలగించాలని గ్రామస్థులు విద్యుత్ శాఖను డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## అంగన్వాడీ వేతనాలు పెంచాలని నినాదాలు

- మండల అధికారులకు వినతి పత్రం అందజేత




**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 21:**అంగన్వాడీ వేతనాలు పెంచాలని సీతానగరం మండలంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ బ్లాక్ డే నిరసన చేపట్టి మండల తాసిల్దార్ కు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుండిఅంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని ఈ కాలంలో పని భారం పెరిగిందని 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ఇచ్చారు. అయినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవడంలేదని అంగన్వాడీ సెంటర్లో నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని అంగన్వాడి టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అని సరుకులు కూడా ఒకసారిగా రావడం లేదనిప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు మారినప్పటికీ, ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలు మారబోవు అని అన్నారు.అంగన్వాడీ వర్కర్లు చేసే పోరాటం అందరికీ తెలిసిందేనన్నారు. పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## గొల్లపాలెం కాకతీయ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే అట్టహాసం





**కాజులూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :**గొల్లపాలెం కాకతీయ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా, అట్టహాసంగా జరిగాయి. విద్యార్థుల ఉత్సాహం, అతిథుల సూచనలు, సాంస్కృతిక ప్రదర్శనలు కలగలిపి కళాశాల ఆవరణ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథులుగా గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు,బందనపూడి టిడిపి నాయకులు జక్కన రాజేష్, న్యాయవాది రెడ్డి అన్నవరం హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కృషి, క్రమశిక్షణ, విలువలు అత్యవసరమని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు పి.ఎస్ రాజు, కరస్పాండెంట్ పి ఎం.రామయ్య, ప్రిన్సిపాల్ పుణ్య మంతుల బాలకృష్ణారావు, అధ్యాపకులు కె.శివ, కె. నాగబాబు, కె.నాగేశ్వరరావు, ఎస్ .జోజిబాబు, హరీష్, శ్రీనుబాబు, సురేష్, సీతారాం తదితరులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ ప్రథమ సంవత్సరం బైపిసి విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన పిల్లి లహరిక, అలాగే ఇండివిద్యువల్ థర్డ్ సాధించిన ఇతర ప్రతిభావంతులైన విద్యార్థులను శాలువాలు కప్పి సన్మానించారు.ఫ్రెషర్స్ తమ వినూత్న సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రోతలను అలరించగా, సీనియర్ విద్యార్థులు వారిని ఆత్మీయంగా ఆహ్వానించారు. మొత్తం కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగి కళాశాల ఆవరణ ఉత్సాహ భరితంగా మారింది.

## 23 24 తేదీలలో చించినాడ బ్రిడ్జి మరమ్మతు పనులు

**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21:** గోదావరి నదికి వరద ఉధృతి అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజానీకం పౌర జీవనానికి ఇబ్బంది కలగకుండా వ్యాధిగ్రస్తులు వృద్ధులు, విభిన్న ప్రతిభా వంతులు గర్భిణీ స్త్రీల ఎన్నో దూరభార ప్రయాణాలను పరిగణనలో తీసుకొని వారి శ్రేయస్సు కోసం దిండి ,చించినాడ వంతెన 216 జాతీయ రహదారి మర మ్మత్తుల పనుల కోసం నిలిపివేస్తూ ప్రకటించిన రాకపోకలు రెండు రోజుల పాటు ఈనెల 21, 22 తేదీలలో సడలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు.ఈ రెండు రోజులలో గోదావరి ఉధృతి కొంతవరకు తగ్గే అవకాశం ఉందని తదుపరి ఈ నెల 23 ,24 తేదీలలో యధావిధిగా వంతెన పై పూర్తిగా రాకపోకలను నిలుపుదల చేసి మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.దిండి,చించినాడ వంతెన వద్ద మరమ్మతు పనులు బేరింగ్ రీప్లేస్మెంట్ పనుల కోసం ట్రాఫిక్ నియం త్రణ కొరకు ఈనెల 23, 24 తేదీలలో ఉదయం 10:00 నుండి రాత్రి 08:00 వరకు నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.కావున చించినాడ 216 జాతీయ రహదారి వెంబడి పర్యటించే వాహనదారులు ,ఈ విష యాన్ని గమనించి అధికార యంత్రాంగానికి పూర్తిగా సహకరిస్తూ ,ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం మన గ్రామాన్ని మనమే కాపాడుకుందాం






**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు21:**ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం కాలుష్యాన్ని నివారిద్దాం అనే నినాదంతో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందు చైత్యవంతులు కావాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. పుల్లేటికుర్రులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి సమాజంలో కాలుష్యానికి ప్రధాన కారణమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి ప్రతిఒక్కరూ చమరగీతం పాడాలని ఆయన సూచించారు. రోజురోజుకీ కాలుష్యం పెరిగుతుందని దీనిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వ్యాపారులు వినియోగిస్తున్న ప్లాస్టిక్ పేపరు వల్ల క్యాన్సర్, అనారోగ్యం భారీన పడుతున్నారని వివరించారు. గ్రామంలో ఉన్న హెూటల్స్, స్వీట్ స్టాల్స్, చాట్ బళ్ళు, మాంస విక్రయదారులకు, కిరాణా, ఫ్యాన్సీ షాపుల యజమానులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ వల్ల ప్రభలే రోగాలను వివరించారు.

ప్లాస్టిక్ వాడకం నివారిద్దాం, మన గ్రామాన్ని మనమే కాపాడుకుందాం నినాదంతో అవగాహన కల్పించారు.

అంతకుముందు గ్రామంలో శానిటేషన్ చేపట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.లక్ష్మీపతి, ఆరోగ్య సిబ్బంది పి, ఏసుబాబు, ఎపీహెచ్ఎ ఎం.ఎసి.షైనా, ఎంఎలెచ్పీ కె.అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## క్యాన్సర్ స్క్రీనింగ్ నివారణ పై శిక్షణ





**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21:** వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, డా. బి.ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేదుకు గురువారం నుంచి వచ్చే నెల 15 సెప్టెంబర్ 2025 వరకు అసంక్రమిక వ్యాధుల ఎన్ సి డి 4.0 గురించి శిక్షణలో భాగంగా కొనసీమ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పీహెచ్సీ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు సిహెచ్ సి వైద్యాధికారులు , ఎన్ ఎం హెచ్ పి,ఎం ఎల్ హెచ్ పి తదితర సంబంధిత ఆరోగ్య సిబ్బందికి విస్తృతమైన సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్, నివారణ శిక్షణ కార్యక్రమం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో జరుగుచున్నాయి. కోనసీమ జిల్లాలోని ఫ్రంట్లైన్ ఆరోగ్య సిబ్బందిలో ప్రారంభ దశలో గుర్తింపు, నిర్ధారణ, నివారణ సామర్థ్యాలను బలోపేతం చేయడం,ఈ శిక్షణ కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ శిక్షణలో ప్రధాన అంశాలు దృష్టి సారించారు.సర్వికల్ క్యాన్సర్కు కారణమైన ప్రమాద కారకాలు, వ్యాప్తి శాస్త్రం (ఎపిడెమియోలజీ),(విజువల్ ఇన్స్పెక్షన్ విత్ అసిటిక్ యాసిడ్) వంటి స్క్రీనింగ్ పద్ధతులు సూచన,ఫాలో–అప్ సంభందిత మార్గదర్శకాలు.అవగాహన కల్పన మరియు సముదాయ భాగస్వామ్యం వ్యూహాలుఈ కార్యక్రమం ద్వారా నివారించదగిన క్యాన్సర్ల భారం తగ్గించడం,మహిళల ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచ డం వంటి లక్ష్యాలతో శాఖ కలిసికట్టుగా పనిచేస్తోంది.

ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.ఎం.దుర్గా రావు దొర ఆధ్వర్యంలో,నోడల్ ఆఫీసర్ తిరుమల రావు,ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎం. సుమలత, డి సి హెచెస్ .డా.కార్తీక్ రెడ్డి,ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.శంకర్ రావు, డా. అనూష మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ లు నిరసనలు



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు21:**స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తుల, ఆయాలు ఆంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తలకు పెనుభారంగా మారిన అధిక శ్రమతో కూడిన పనులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అంబాజీపేట మండల అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలువురు వక్తుల మాట్లాడుతూ 2014 నుండి కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచలేదన్నారు. ఆంగన్వాడీలచే నిర్వహిస్తున్న యాప్ లు వినియోగించడానికి ఫోన్లు సపోర్టు చేయడం లేదన్నారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేసారు.

గ్రాడ్యూటీ జీవోలు మార్పులు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు గైడెన్స్ మార్పు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి - గొల్లపాలెం ఎస్సై



**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 21 :**ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో గణేష్ మండపాలు, పందిళ్ళు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా అనుమ తులు పొందాలని గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా https://ganeshutsav.net వెబ్సైటులో సులభంగా దరఖాస్తు చేసుకొని మండపాల ఏర్పాటుకు, ఊరేగింపులకు, నిమజ్జనానికి అనుమతులు పొందవచ్చని ఆయన వివరించారు. దరఖాస్తు అనంతరం సంబంధిత పోలీసులు ప్రాంగణాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని, ఆన్లైన్ లో ఎన్ ఓ సి %ఉ% క్యూ ఆర్ కోడ్ డౌన్లోడ్ చేసి మండపంలో ఉంచాలని సూచించారు.గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు లేకుండా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించా లని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## గ్రామస్థాయి సంఘాలను బలోపేతం చేయాలి




**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21:**గ్రామస్థాయిలో ఉన్న సంఘాలను బలోపేతం చేయాలని తద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘం బలోపేతం అవుతుందని వెలుగు ఏపిఎం అప్పలకొండ, హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. గురువారం నాడు స్థానిక వెలుగు కార్యాలయంలో నవజీవన్ ఆర్గనైజేషన్ మరియు హిఫర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గంగవరం మండలం రైతు ఉత్పత్తిదారుల సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు బిజినెస్ ప్లాన్ ఒక్కరోజు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రెసిడెంట్ కోసూరి రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలను మర్చిపోయారని గతంలో లాగా చిరుధాన్యాలు పండించుకుని వాటికి మంచి గిట్టుబాటు ధర ఉందని తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న సంఘాలను బలోపేతం చేయాలని ఆమె తెలిపారు. హైపర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత మాట్లాడుతూ మండలంలో జీడిమామిడి, సాగోదుంప విరివిగా పండుతుందని వాటిని గ్రామస్థాయి సంఘాల ద్వారా గాని, రైతుత్పత్తిదారుల సంఘాల ద్వారా కానీ అమ్మి మంచి గిట్టుబాటు ధర సంపాదించుకోవాలని ఆమె అన్నారు. గ్రామస్థాయిలో ఉన్న సంఘాల ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకుని, పొదుపులు చేసుకోవడం ద్వారా అవి బలోపేతం అవుతాయని అన్నారు. అనంతరం ఎఫ్పిఓ డైరెక్టర్లతో బిజినెస్ ప్లాన్ తయారు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవజీవన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వీరాంజనేయులు, బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, బాబురావు, సి ఎఫ్ లు మళ్ల భవాని ప్రశాంత్, చిన్నాలు దొర, ఎఫ్ పి ఓ సి సి సింహాచలం, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ప్రదీప్, అంజి, పోట్టిదొర, రాజు తదితరులు పాల్గొన్నారు.



# రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమండ్రిలో కలపొద్దు.

- **ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్**



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21:**రంపచోడవరం నియోజకవర్గంను రాజమండ్రి జిల్లాలో కలపొద్దని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది.గురువారం గంగవరంలో ఆదివాసి సంక్షేమ పరిషత్(274/16) కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆదివాసి సంక్షేమ పరిషత్ గంగవరం మండల అధ్యక్షులు కంగాల అబ్బాయి దొర మాట్లాడుతూ ప్రస్తుతం అల్లూరు జిల్లాలోని కొనసాగుతున్న రంపచోడవరం నియోజకవర్గం అల్లూరు జిల్లాలోని కొనసాగించాలని రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమండ్రి జిల్లాలో కలపవద్దని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం లేకపోయినా ఆదివాసుల కోసం ప్రత్యేక ఆదివాసి జిల్లా ఉందని ఇన్ని రోజులు సంతోషించామని కానీ ప్రభుత్వం కుట్రల తోటి అల్లూరు జిల్లా నుంచి రంపచోడవరం నియోజకవర్గాన్ని తొలగించి, అల్లూరి జిల్లాలోకి మాడుగుల నియోజకవర్గాన్ని కలపటం, అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గం నీ రాజమండ్రిలో కలపటం వలన ఆదివాసులు ఐక్యత దెబ్బతింటుందని ఆదివాసుల యొక్క బలం తగ్గుతుందని ప్రస్తుతం అల్లూరు జిల్లా ఎలా ఉందో యధావిధిగా కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రంపచోడవరం నియోజకవర్గం రాజమండ్రిలో కలిసిన, మాడుగుల నియోజకవర్గం అల్లూరు జిల్లాలో కలిసిన భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన లో ఆదివాసీలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఈ విషయాన్ని యావత్ ఆదివాసి ప్రజానీకం ఆలోచించాలని గిరిజనేతరులు, ప్రభుత్వాలు కలిసి పన్నుతున్న ఈ కుట్రను ఆదివాసీలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన ఆదివాసులను కోరారు. ఇప్పటికే సొంత గడ్డపై ఆదివాసులు ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవిస్తున్నారని ఆదివాసి చట్టాలు సరిగా అమలు కాక ఒకపక్క ఉద్యోగ, ఉపాధి జీవోలు కోల్పోతూ ఆదివాసీల సంస్కృతి నాశనం అవుతూ ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రత్యేక ఆదివాసి జిల్లాతోనైనా ఆదివాసి చట్టాలు అమలు చేయించుకుంటామని సంస్కృతిని పరిరక్షించుకుంటామని కావున ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమండ్రిలో కలిపే ఆలోచన విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని ఎడల ఆదివాసులను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చోడి ప్రదీప్ కుమార్ దొర , సత్తిబాబు, నాయకులు చోడి ఏడుకొండలు, ప్రసాద్ దొర , తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ నిలుపుదల

**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు21:**మండలంలో అంబాజీపేట, గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గల గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు గున్నేపల్లి, గంగలకుర్రు పరిధిలో కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు విద్యుత సరఫరా ఉండదన్నారు. 33 కేవీ విద్యుత్ లైన్లకు, 11 కేవీ విద్యుత్ లైన్లు మరమత్తు పనులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి, ఎఫ్ .ఆర్ .ఎస్ యాప్ ను రద్దు చేయాలి,





- **ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి, గ్రాట్యూటీ అమలు చేయాలి.**
- **ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21:**అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో చేపట్టిన నిరసనలో భాగంగా గంగవరం ఐసిడిఎస్ కార్యాలయం లో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సమస్యలతో కూడుకున్న వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కే రాణి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల ఆన్లైన్ యాప్ పెట్టడంతో ఈ యాప్ లలో వర్క్ చేయాలంటే సెల్ పని చేయకపోవడంతో ఆన్లైన్ వర్క్ చేయడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, ఈ ఆన్లైన్ వర్క్ ద్వారా వర్కర్లు అనారోగ్య పాలవుతున్నారని అన్నారు.

ఎఫ్ ఆర్ ఎస్ యాపు పోషణ ట్రాక్ యాప్ ఇక ఇతర యాప్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యత కూడిన 5 జి ట్యాబ్ లను అందించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మాతృ వందనం పథకం అప్పగించవద్దని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు అంగన్వాడి వర్కర్స్ అనేక రకాల హామీలు ఇచ్చిందని అన్నారు.

42 రోజుల సమ్మె కాలం సందర్భంగా జరిగిన ఒప్పందాలు అమలు చేయాలని ఒకటికి పది సార్లు అంగన్వాడి వర్కర్స్ అని హెల్పర్స్ యూనియన్ గా ప్రభుత్వాన్ని అడిగిన స్పందించలేదని అన్నారు.

అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు . ఈ సందర్భంగా స్థానిక వై జంక్షన్ లో అంగన్వాడీ సిబ్బంది మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమం లో నాగదేవి ,సుజాత ,కటాక్షం రమణ తదితర అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు పాల్గొన్నారు

# ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు.

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు.**



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 21 :**జిల్లాలో ఎరువుల డీలర్ లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు స్పష్టం చేశారు. మండపేట మండలం లో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు గురువారం ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు.

మండపేట శ్రీ లక్ష్మీ అపూర్వ ఏజెన్సీస్ షాపు రికార్డులు ఎరువుల గోడౌన్ తనిఖీ చేశారు. గోడౌన్లో ఉన్న ఎరువులకు స్టాక్ రిజిస్టర్ లో ఉన్న రికార్డులకు సరి పోయింది.ఎరువులు వ్యాపారస్తులు అమ్మిన ప్రతి బస్తాను ఈ పాస్ ద్వారా రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎటువంటి కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులకు ఎరువులు సక్రమంగా అందే విధంగా క్రింద స్థాయి అధికారులను ఆదేశించారు. అమ్మిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లు రాసి రైతుకు ఇవ్వాలన్నారు. అమ్మిన ప్రతి బస్తా కూడా ఈ పాస్ ద్వారా బయోమెట్రిక్ తీసుకుని రైతుకు ఇవ్వాలన్నారు. ఇందులో ఎటువంటి జాప్యం, ఆలస్యం జరిగిన ఎరువులు వ్యాపారస్తులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా వ్యవసాయ అధికారి వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు సి హెచ్ కేవీ చౌదరి , మండల వ్యవసాయ అధికారి కే ప్రభాకర్, విస్తరణ అధికారి బాలకృష్ణ ఉన్నారు.

# గో సంరక్షణకు పశుగ్రాసం వితరణ



**పుట్టా ప్రభాకర్ దాతృత్వం**

**మండపేట. పెన్ పవర్. ఆగస్టు 21 :** ఆకలితో అలమటిస్తున్న గోవులు అనే శీర్షికపై వెలువరించిన కథనంపై దాతలు విశేషంగా స్పందిస్తున్నారు. మండపేట పట్టణంలోని గోశాలలో జీవిస్తున్న 25 ఆవులకు ఆహారం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. సహృదయంతో స్పందిస్తున్న దాతలు, పలువురు గో ప్రేమికులు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించి గొప్ప మనసును చాటారు. కొంతమంది దాతలు ఫోన్ పే ద్వారా నగదు సహాయం అందించగా మరి కొంతమంది గోవులకు పశుగ్రాసం దానం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చిన వార్తను చూసిన పట్టణ ప్రముఖుడు ముత్యాల రామకృష్ణ (సప్తగిరి రామకృష్ణ ) తన చిన్ననాటి స్నేహితుడు పుట్టా ప్రభాకర్ కు వాట్సాప్ లో పంపగా గోవుల దీన స్థితిని చూసిన ఆయన చలించి పోయారు. మెహెర్ బాబా ఆశ్రమంలో నివాసముంటున్న పుట్టా ప్రభాకర్ వెంటనే 14 కుంచాల ఎండుగడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్ పై గోశాలకు పంపారు. స్వయంగా ఆయన గోశాలకు వచ్చి తన సొంత మనుషులతో అన్లోడ్ చేయించి గడ్డిని అప్పగించి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మిత్రుడు సప్తగిరి రామకృష్ణ చెబితే తెలుసుకున్నానని మూగ జీవాలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభాకర్ చౌదరి ఔదార్యానికి పలువురు అభినందనలు తెలిపారు. గొప్ప మనసుతో గోవులకు ఆహారం అందించిన దాత ప్రభాకర్ కు గోశాల నిర్వాహకులు అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ కృతజ్ఞతలు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి గోవులకు రక్షణగా నిలబడాలని ఆశిద్దాం.

# మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలి

- **దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం**
- **వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్**





**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 21 :**మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పలు వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తున్నామని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాలలో నాలుగు రోజులపాటు ఏర్పాటు చేసిన ఉచిత గృహపకరణాల తయారీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా రామచంద్రపురం నియోజవర్గంలో మంత్రి సుభాష్ గారి ఆలోచనల్లో అడుగులు వేస్తూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత కోసం సీఎం చంద్రబాబు నాయుడు వినూత్న పథకాలు అమలు చేస్తున్నారని, ఆయన ఆశయం మేరకు మహిళలకు పలువృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారి ఉపాధికి ఊతం ఇస్తున్నా మన్నారు. ఇప్పటికే కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. అపార అనుభవం ఉన్న శిక్షకులను తీసుకొచ్చి కోర్సు అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. గృహ సంబంధ ఉత్పత్తుల తయారీ శిక్షణ తీసుకున్న 35 మంది మహిళలకు వాసంశెట్టి సత్యం, శిక్షణా నిపుణురాలు ప్రియాజైన్ (బెంగుళూరు) చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. సేవా కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న మహిళలు మాట్లాడుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా సబ్బులు, షాంపూలు లోషన్లు, టూత్ పేస్టులు, లిప్ బామ్ ల తయారీ ఉచిత శిక్షణ తమ జీవనాధారానికి ఉపయుక్తంగా ఉంటుందని మంత్రి సుభాష్ కు, ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ జిల్లా పర్యటన విజయవంతం చెయ్యండి



**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 21:** పట్టణ బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు అయ్యల భాస్కరరావు ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు శోభాయాత్ర కార్యక్రమం నిమిత్తం అమలాపురం టౌన్ ఇంచార్జి గా కటిక రెడ్డి తమ్మయ్య నాయుడు పాల్గొని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ జిల్లాల పర్యటన లో భాగంగా ఈ నెల 25 న సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటించనున్నారు.రాష్ట్ర అధ్యక్షులు హోదాలో మొదటి సారి వస్తున్న సందర్భంగా జరిగే చాయ్ పే చర్చ కార్యక్రమం, శోభా యాత్ర లో బిజెపి నాయకులు, కార్యకర్తలు, బిజెపి అభిమానులు తో పెద్ద ఎత్తున పార్టీ జండా లతో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసి భారతీయ జనతా పార్టీ బలాన్ని చూపించాలని దీనికోసం శక్తి కేంద్ర ప్రముఖులు, బూత్ కన్వీనర్ లు భాద్యత తీసుకొని ఇప్పటినుంచి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కటిక రెడ్డి తమ్మయ్య నాయుడు మాట్లాడారు,ఈ కార్యక్రమం లో రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ కన్వీనర్ ఆకుల వీరబాబు. టౌన్ ప్రధాన కార్యదర్శి డివిఎస్ రాజు,బచ్చు ప్రభాకర్, పావులూరి వెంకట్,బండి శ్రీనివాస్,ఈతకోటబాలస్వామి,గోవ్వల తిరుమల రావు, బజరంగ్ ఊటుకురి సాంబ మూర్తి, ఊటుకూరి మురళి,పొన్నగంటి శివ తదితరులు పాల్గొన్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# రేపు మండపేట లో విద్యుత్ సరఫరా కు అంతరాయం.



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 21 :**విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు దృష్ట్యా మండపేట లో కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందనీ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రత్నాల రావు తెలిపారు.

రేపు 22 శుక్రవారం ఉదయం 08 -00 గంటల నుండి మధ్యాహ్నం 01-00 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు. ఏడిద రోడ్డు లో పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న సబ్ స్టేషన్ లో ఉన్న విద్యుత్ లైన్ లమరమత్తులు చెట్టులు కొమ్మలు తొలగించడం నిమిత్తం విద్యుత్ నిలుపుదల చేస్తారు. బైపాస్ రోడ్డు, ఏడిద రోడ్డు , రాజీవ్ గృహకల్ప కాలని , సంగం కాలనీ , విజయలక్ష్మినగర్ , మెహర్ ఆశ్రమం, సత్య శ్రీ రోడ్డు, మెయిన్ రోడ్డు, బస్ స్టాండ్ రోడ్డు, తర్వాణి పేట, సెంటెన్స్ స్కూల్ వద్ద, పెద్ద కాలువ వంతెన, వీరభద్రపురం, బ్యాంకు కాలని, శ్రీ లక్ష్మి నగర్ లలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఏడిద లో విద్యుత్ సరఫరా కు అంతరాయం.

శుక్రవారం ఉదయం 0 8 - 00 గంటల నుండి మధ్యాహ్నం 02- 00 గంటల వరకు ఏడిద గ్రామం , ఏడిద సావరం, ఏడిద సీతనగరం లలో విద్యుత్ లైన్ ల మరమ్మతులు , చెట్టు కొమ్మలు తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు రామచంద్రపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రత్నాల రావు తెలిపారు. .

## చంపాలనుకున్నా మనుషులనే బ్రతికిస్తుంది.

# జీవం పోసుకున్న మహా వృక్షం.

**మండపేట. పెన్ పవర్. ఆగస్టు 21 :**చెట్లను విచక్షణ లేకుండా నరికేస్తున్నారు. ఆ వృక్షాలు మాత్రం తిరిగి ప్రాణం పోసుకొని పచ్చదనం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ద్వారపూడి బంగారమ్మ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఎన్నో ఏళ్లనాటి భారీ రావి వృక్షాన్ని కొన్నాళ్ల క్రితం తొలగించాలన్న ఉద్దేశంతో చెట్టు మొత్తం నరికివేసారు. మోడు మాత్రం వదిలేశారు. చెట్టు మనుషుల్లా పగా ప్రతీకారాలతో కాకుండా ప్రేమ కురిపిస్తుంది. తిరిగి చిగురించి ఎందరికో ఆక్సిజన్ అందిస్తుంది. వృక్షో రక్షతి రక్షితః అనే సూక్తిని ఆచరిస్తే ఈ ప్రకృతి ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఈ చెట్టు ను చూసిన స్థానికులు చంపాలనుకున్న మనుషులకు ఆక్సిజన్ ఇస్తూ వారిని బ్రతికిస్తుందని చెబుతున్నారు.



## బిర్యాని సెంటర్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 21:** యువత వ్యాపారాన్ని ఆత్మవిశ్వాసంతో ముందుకు రావడం ఎంతో ఆనందకరమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం జీలుగుమిల్లి శర్మ కాంప్లెక్స్ లో బిస్మిల్లా నూతన బిర్యాని సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న సరహ వ్యాపారాలు స్థానికులకు ఉపాధి కల్పించడంతోపాటు అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించే కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించడం సానుకూల సంకేతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ , జనసేన సీనియర్ నాయకులు సిరి శ్రీను, రాధాకృష్ణన్ రాజు, జానకిరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మేంబర్ నీ పరామర్శించిన గడ్డమణుగు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 21 :** తాటి యాకుల గూడెం పంచాయతీ వార్డు నంబర్ జనసేన పార్టీ నాయకులు అమృతవల్లి రవి తండ్రి నాగేశ్వరరావు మృతి చెందారు. గురువారం జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవి కుమార్ పరామర్శించారు. వారి కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడు తోడు ఉంటుందని అన్నారు. పరామర్శించిన వారిలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, జనసేన నాయకులు సిరి రాంపండు, రాయి సుబ్బారావు, మేకల శ్రీను ఉన్నారు.

## బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

- వైసీపీ కో ఆర్టినేటర్ ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి, పెన్ పవర్ ఆగస్టు 21:**బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ కో ఆర్టినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు.కిర్లంపూడి ముద్రగడ నివాసంలో గురువారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల కన్వీనర్లతో పార్టీ కార్యక్రమాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామాల్లో గ్రామ కమిటీలను, బూత్ కమిటీలను వేసి గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూతూ మంత్రంగా అమలు చేసి కూటం ప్రభుత్వం హామీలను అమలు చేసినట్టు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు శిడగం వెంకటేశ్వరరావు, నరాల శ్రీను, గొల్లపల్లి సురేష్, రామిశెట్టి నాని, వాసిరెడ్డి భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలను గుర్తించాలి






## సేవతో తృప్తి... సాయంతో సంతృప్తి

### జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

**గంగవరం / రంపచోడవరం, పెన్ పవర్ ,ఆగష్టు 21:** వేగవంతంగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలను గుర్తించాలి, సేవతో తృప్తి... సాయంతో సంతృప్తినిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు.గురువారం రంపచోడవరం నుండి జిల్లా కలెక్టర్ అందరూ మండల స్పెషల్ ఆఫీసర్ లు, ఎంపిడిఓ లు, తహశీల్దార్లతో, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేటికీ నమోదైన మార్గదర్శులు, బంగారు కుటుంబాల వివరాలపై ఆరాతీశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా బంగారు కుటుంబాల వివరాలు సిద్ధం చేయాలన్నారు. మండలం స్థాయిలో మండలం ప్రత్యేక అధికారి పూర్తి భాధ్యతలు వహించాలన్నారు. మండలం ప్రత్యేక అధికారి మండలం అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మండల, సచివాలయ స్థాయిలో పురోగతి లేన్నారు. మండల ప్రత్యేక అధికారి, తహసీల్దారులు, మండల అభివృద్ధి అధికారులు సమన్వయంతో పనుల పురోగతి కావాలన్నారు. రానున్న మూడు రోజుల్లో మార్గదర్శులు, బంగారు కుటుంబాలు గుర్తించాలన్నారు. ప్రాజెక్ట్ అధికారులు రోజు వారీగా ఎన్రోల్ అయినా మార్గదర్శులు, బంగారు కుటుంబాల పై సమీక్షించాలన్నారు. సచివాలయం ద్వారా ఎన్రోల్ వేగవంత చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారి, తహసీల్దారులు, మండల అభివృద్ధి అధికారులు వారి మండలంలో నిడ్ ఆసిస్మెంట్ విద్య, వైద్యం తదితరాలు గుర్తించాలన్నారు. గ్రామాల వారీగా పర్యటించి అక్కడ ఉన్న వారు ఎన్రోల్ అయ్యారో లేదో ఆరాతీసి ఎన్రోల్ చేయాలన్నారు.అంతేకాకుండా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వివిధ శాఖల సేవలలో పనితీరును తెలుసుకుంటూ సేకరించిన ఐ వి ఆర్ ఎస్ కాల్స్ నుద్దేశించి పంచాయతీ శాఖ, రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయ్, ఆరోగ్య శాఖ ల జిల్లా అధికారులతో విశ్లేషించి తగు ఆదేశాలు జారీ చేస్తూ, పలు సూచనలు చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ కి జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ్, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు కె. సింహాచలం, అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్, (వర్చువల్), పాడేరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా రెవిన్యూ అధికారి పద్మాలత, జిల్లా %ూ%4 ప్రత్యేక అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.వి.ఎస్. లోకేశ్వర రావు, డిజిపిఓ కె. పి. చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు హాజరైయారు.

## గోపన్నపాలెంలో పశువులకు తాగునీరేది?



**ఏలూరు ఆగస్టు 21 పెన్ పవర్ :** దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండలం పరిధిలో పలు గ్రామాల్లో పశు వులు నీరు త్రాగడానికి 2016లో తెలుగుదేశం ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా మండలంలోని గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని నీటి తొట్టెలు నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికి వదిలేసిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ నిధులతో వాటిని పునరుద్ధరించి, లేనిచోట కొత్తవి నిర్మించి పశువులు తాగడానికి నీటి తొట్టెలు అందుబాటులోకి తెచ్చింది. తొట్టెలను నింపడానికి కుళాయి సౌకర్యం కల్పించింది. అయినా గ్రామంలో యానిమల్ హస్బండ్రీ పర్యవేక్షణ లేని కారణంగా (ఏ హెచ్ఎ) కు అక్కడ పశువుల తాగునీటి కొరకు తొట్టె నిర్మించారనే విషయం తెలియదు. పశువులకు తాగునీటి తొట్టెలు ఖాళీగా దర్శనమిస్తున్నాయని వీహెచ్ఏ ప్రభాకర్ రావుని వివరణ కోరగా తమ గ్రామంలో పశువుల తొట్టిలు నిర్మించలేదని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. ఈ తొట్టెలు పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగం లేకుండా పోయాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకొని పశువుల దాహార్తిని తీర్చే నీటి తొట్టెలను నీటితో నింపాలని గ్రామ రైతాంగం కోరుతోంది.

## గణేష్ ఉత్సవం సింగల్ విండో పై అవగాహన



### రూరల్ ఎస్ఐ శేఖర్ బాబు

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21 :**గణేష్ ఉత్సవం-2025కు సంబంధించి పోలీసు, రెవెన్యూ, ఫైర్, మున్సిపల్/పంచాయతీరాజ్,కాలుష్య నియంత్రణ బోర్డు,విద్యుత్ శాఖ అధికారులతో సింగిల్ విండో సిస్టమ్ ద్వారాఎటువంటి ఫీజు లేకుండా, అనుమతి పొందే అవగాహనను నిర్వాహకుల తెలియజేయటం జరిగిందనని రూరల్ ఎస్సై శేఖర్ బాబు తెలిపారు. పందిరిల నిర్వాహకులకు భద్రతా అవసరాల గురించి వివరించినట్లు తెలిపారు.

పందిరిల వద్ద ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే, వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు '112'కు డయల్ చేయాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించటం జరిగిందని తెలిపారు.భక్తి గీతాలు ప్లే చేయడానికి సౌండ్ సిస్టమ్‌ను ఉపయోగించేలా నిర్వాహకులకుసూచించటం జరిగిందని,పేర్కొన్నారు.పిల్లలు, వికలాంగ వ్యక్తులను జలనిమజ్జన స్థలానికి లేదా విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అనుమతించకూడదని, ఈ విషయంలో వారి తల్లిదండ్రులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకుసూచించటం,

చిన్నారులైన అబ్బాయిలు ఆడపిల్లలను జలనిమజ్జన స్థలాలలో నీటిలోకి అనుమతించరాదని తెలియజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి ధర్నా



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21 :**ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో లో అమలాపురం మండలం తాసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా చేసి విన్నపత్రం సమర్పించారు.

ఈకార్యక్రమంలో అంగన్వాడీ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి,ఎఫ్ ఆర్ ఎస్ రద్దుచేయాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని,అఖిల భారత పిలుపులో భాగంగా అమలాపురం ప్రాజెక్ట్ పరిధిలో మూడు మండలాలు నిరసనలు జరిగాయి. అంగనవాడి వర్కర్స్ సంబంధించి న్యాయమైన డిమాండ్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం 2014 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదు. మన రాష్ట్రంలో 2019 నుండి వేతనాలు పెంచలేదు.ఈ కాలంలో పనిభారం పెరిగింది. 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలుపెంచుతామని మినిట్స్ ఇచ్చారు.అయినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవటం లేదు.అంగన్వాడీ సెంటరు నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణట్రాక్టరు,బాలసంజీవిని యాప్పు అమలుకు సపోర్ట్ చేయటంలేదు.లబ్ధిదారులు కు పోటోక్యాప్చర్,ఓటిపి, ద్వారా నే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయటానికి అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరుకులు అన్ని ఒక్కసారి గా రావటంలేదని,నెట్ సిగ్నలేకపోవడం,సర్వర్లు పనిచేయకపోవడంవలన లబ్ధిదారులందరూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

యాప్ లు అన్ని కలిసి ఒక యాప్ గా మార్పుచేయాలని, ఇన్, అవట్ రద్దు చేయాలని, సెంటరు నిర్వహణకు ట్యాబుల్ ఇవ్వాలని 5జి నెట్ ఇవ్వాలని ,ప్రధాన మంత్రి మాతృ వందనం పథకం నీ కొత్తగా అంగన్వాడీలు అప్పగించరాదని తెలిపారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి, మినీలును మెయిన్ వర్కర్లు గా మార్చుతూ జీవో ఇవ్వాలని, గ్రాడ్యుటి జీవోలో మార్పులు చేయాలని, హెల్పర్లు ప్రమోషన్ లకు గైడ్లెన్స్ రూపొందించాలని కోరుతున్నాం అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కలగజేసుకుని అంగన్వాడీ యూనియన్స్ రాష్ట్ర నాయకత్వాన్ని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అమూల్య, దుర్గ, పార్వతి, మణి మాల,విజయ ఉమా తదితరులు నాయకత్వం వహించారు.

## అక్రమంగా తొలగించిన దివ్యాంగుల పింఛన్లు తక్షణం పునరుద్ధరణ చేయాలి



### ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్

**అల్లవరం, పెన్ పవర్, ఆగష్టు 21:**కూటమి ప్రభుత్వం దివ్యాంగు ల పింఛన్లు రీ సర్వే పేరుతో సుమారుగా నాలుగు లక్షల పింఛన్లు నిలిపివేయటం చాలా దారుణమైన నిర్ణయమని వెంటనే అందరి పెన్షన్లు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేసిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ కూటమి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా తీసుకుంటున్న వికలాంగుల పింఛన్లు ఈరోజు రీ సర్వే పేరుతో సదరం ద్వారా వికలాంగ శాతం 40 శాతం లోపు వేయించి తద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా నాలుగు లక్షల మంది పింఛన్లు నిలిపివేయటం మానవతకే సిగ్గుచేటని, మనసున్న ప్రభుత్వం, మంచి ప్రభుత్వం అని చెప్పుకొని ఈ ప్రభుత్వం ఇటువంటి హేయమైన చర్య వికలాంగుల పట్ల చూపించడం అత్యంత దారుణమని,గత ప్రభుత్వం పింఛన్లు ప్రతి సంవత్సరం పెంచుకుంటూ పోతే ఈ ప్రభుత్వంలో పింఛన్లు ప్రతి సంవత్సరం తగ్గించుకుంటూ పోతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క వికలాంగుడికి పింఛన్ ఆసరాగా ఉపయోగపడుతుందని, వారి జీవనోపాధిని, మనో ధైర్యాన్ని దెబ్బతినేలా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరమని తెలియజేశారు.

వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని అందరికీ పింఛన్లు పునరుద్ధరణ చేయాలని లేకపోతే వైఎస్ఆర్సిపి పార్టీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని డిమాండ్ చేశారు.

# నిర్వాసితులు కలెక్టర్ ను ఒకే ఒక కోరిక కోరారు





- ముంపు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ పర్యటన
- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి,పురావాస కేంద్రాలకు తరలించాలని
- వచ్చే వరదలు మీరు చూడరన్న కలెక్టర్ దినేష్ కుమార్

**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 21.**గోదావరి,శబరి పరివాహక ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు నదులు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మండలంలోని ముంపు ప్రాంతాలలో పర్యటించారు.ముంపుకు గురై రిహ్యాబిటేషన్ సెంటర్లకు వెళ్లిన నిర్వాసితులతో మాట్లాడి నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు.అనంతరం శబరి,గోదావరి వంతెన వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులు వద్దకు వచ్చినప్పుడు వారు ఒకే ఒక కోరిక కోరడం జరిగింది. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ మూలంగా ప్రతి సంవత్సరం వరద ముంపు గురికావడం జరుగుతుందని,ఈ బాధలు మేము పడలేమని త్వరగా మాకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి నివాసయోగ్యమైన గృహాలను కట్టించి తరలించాలని కోరారని అన్నారు.పోలవరం ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చాలా సీరియస్ గా ఉన్నారని అన్నారు.గత వరదలు ప్రస్తుత వరదలు డేటా మా వద్ద ఉన్నదని పేర్కొన్నారు.16 గ్రామాల ఆర్ అండ్ ఆర్ డ్రాఫ్ అవార్డు కమిషనర్ కు పంపడం జరిగిందనితెలిపారు. గిరిజనులకు 5 వేల ఎకరాలు ల్యాండ్ టు ల్యాండ్,ఇంటి నిర్మాణం కోసం సమీకరించడం జరుగుతుందని త్వరలోనే పేపర్ స్టేట్మెంట్ వస్తుందని అన్నారు.30 గ్రామాలకు కావలసిన ఆర్ అండ్ ఆర్ డ్రాఫ్ ప్లాన్ ఈ నెల పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.ఆర్ అండ్ ఆర్ ప్లాన్ అప్రూవల్ అయినా కొన్ని గ్రామాలలో కొంతమందికి డబ్బులు జమ అయ్యి,కొంతమంది కి డబ్బులు జమ కాలేదని వారికి కూడా డబ్బులు పడతాయని ఎవరు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు.ఇల్లు నిర్మాణాలు ఎక్కడెక్కడ కట్టి ఆగిపోయాయో అక్కడ కొత్త కాంట్రాక్టర్ ద్వారా టెండర్ పిలిచి ఆగిపోయిన నిర్మాణాలను సెప్టెంబర్ 15, 16 కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.పునరావాస కేంద్రాలలో 6 నెలల్లో అదర్సదుపాయాలు పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు.వచ్చే వరదల కల్లా నిర్వాసితులందరను ఆర్ అండ్ ఆర్ కాలనీలోకి పంపించడం జరుగుతుందని తెలిపారు.కూనవరం,విఆర్ పురం,చింతూరు మండలాల్లో 25 రీ హ్యాబిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, రిలీఫ్ సెంటర్లకు 250 మందిని తరలించడం జరిగిందని తెలిపారు.ముందస్తుగా 55 మంది గర్భిణీ స్త్రీలను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించడం జరిగిందని వారికి ప్రత్యేకంగా గైనకాలజిస్ట్ ను ఏర్పాటు చేశామని అన్నారు. వి ఆర్ పురం మండలంలోని అన్నవరం కాజ్ వే కూలిపోవడంతో 44 గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.4 కోట్లతో బ్రిడ్జి శాంక్షన్ చేయడం జరిగిందనిఅన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో శుభం నోక్వల్, ఏఎస్పి పంకజ్ కుమార్ మీనా,కూనవరం తాసిల్దార్ కే శ్రీనివాస్, ఎంపీడీవో జగన్నాథం,ఎస్ఐ లతా శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్

- ఎమ్మెల్యే శిరీష దేవి హామీ నెరవేర్చినందుకు టిడిపి నాయకుల హర్షం







**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 21 :**చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన సందర్భంగా టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల చింతూరుకు పర్యటన చేసిన ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి ఆసుపత్రి ని 100 పడకల ఆసుపత్రిగా చేస్తానని ఇచ్చిన హామీ వారం రోజుల్లోనే నెరవేర్చడం ఆమె పనితీరు ఎంత చురుకైనదో చాటిచెప్పిందని టిడిపి నాయకులు అభిప్రాయపడ్డారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌లతో పాటు ఎమ్మెల్యే శిరీష దేవి ప్రత్యేక శ్రద్ధ వహించారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శీలం తమయ్య, కారం సత్యవతి కృతజ్ఞతలు తెలిపారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చింతూరులో 30 పడకల ఆసుపత్రి ప్రారంభించగా, ఇప్పుడు వంద పడకల ఆసుపత్రిగా విస్తరించడం చింతూరు డివిజన్ ప్రజలకు గొప్ప వరమని మాజీ టిడిపి అధ్యక్షుడు ఇల్లా చిన్న రెడ్డి పేర్కొన్నారు. ఈ అభివృద్ధి చింతూరు డివిజన్ ప్రాధాన్యతను మరింత పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శిరీష దేవి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత ముందంజలో ఉంటుందని టిడిపి నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఎస్.ఏ. ఆసిఫ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆది కర్మయోగి శిక్షణా కార్యక్రమం పూర్తి



**వై రామవరం, పెన్ పవర్,ఆగస్టు 21 :** గత మూడు రోజులుగా జరుగుచున్న ఆది కర్మయోగి శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసిందని వైరామవరం ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

ఏజెన్సీ గిరిజన ప్రాంతాలలో కెపాసిటీ బిల్డింగ్ విషయంలో గేమ్ చేంజింగ్ గా ఉండాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఇనిషియేటివ్ ప్రోగ్రాం శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. బంగారు కుటుంబాలను వేగవంతంగా గుర్తించాలని, ప్రతి సచివాలయం పరిధిలో ఎన్రోల్మె ట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా విద్య వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ట్రైనింగ్ సర్టిఫికెట్స్ పంపిణీ చేయడం జరిగింది అన్నారు.ఈ మంచి అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పీవో, జిల్లా మాస్టర్ ట్రైనర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# నిషిద్ధ భూముల జాబితా నుండి తొలగించి ప్రభుత్వ పథకాలు అందివ్వాలి.

**-తహసీల్దార్ కు పలువురు రైతులు వినతి.**



**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు 21:** మా ఆధీనంలో ఉన్న మా స్వంత భూములను ప్రభుత్వం నిషిద్ధ జాబితా నుండి తొలగించడమే కాకుండా, అన్నదాత సుఖీభవ పథకంతోపాటు, రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను అందజేయాలని తహసీల్దార్ జె చిరంజీకి గురువారం పలువురు రైతులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ జగపతినగరం గ్రామ పరిధిలో ఉన్న మా భూములను గత ప్రభుత్వం చేసిన రీ సర్వేలో నిషిద్ధ భూముల జాబితాలో చేర్చడం జరిగిందన్నారు, దీని వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వకపోవడంతో బయట నుండి అప్పులు చేసి పంటలు పండిస్తున్నామని, దీంతో వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భూదాన బోర్డులో ఉన్నప్పుడు అన్ని రకాలుగా ప్రభుత్వ లబ్ది చేకూరేదన్నారు.సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు తహసీల్దారుని జె చిరంజీవి ని కోరారు. ఈ కార్యక్రమంలో శరకణం భద్రం, దాడి పెదబుజ్జి, కర్రి వెంకటరమణమూర్తి, బుద్ధ సాయిబాబు, పొలిమేరు రామచంద్రరావు,కర్రి వీరబాబు,ప్రభాకర్,గంటా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కె గంగవరం లో అంగన్వాడీ కార్మికుల ర్యాలీ.






**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 21:**కె గంగవరం మెయిన్ సెంటర్లో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వేతనాల పెంపు, ఎఫ్.ఆర్.ఎస్ రద్దు, సంక్షేమ పథకాల సక్రమ అమలు, గ్రాట్యుటీ జీవోలో మార్పులు వంటి డిమాండ్లతో మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.కార్మికులు మాట్లాడుతూ 2014 నుండి కేంద్ర ప్రభుత్వం, 2019 నుండి రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జూలైలో వేతనాల పెంపుపై ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. అంగన్వాడీ సెంటర్లకు ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయకపోవడం, పోషణట్రాకరు, బాలసంజీవిని యాప్‌లు సపోర్ట్ చేయకపోవడం వల్ల ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సిగ్నల్ లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో సరుకుల పంపిణీ ఆలస్యమవుతోందని పేర్కొన్నారు.అలాగే సెంటర్ నిర్వహణకు ట్యాబుల్, సరైన నెట్‌వర్క్ సదుపాయాలు కల్పించాలని, ప్రధానమంత్రి మాతృవందన పథకాన్ని కొత్తగా అంగన్వాడీలపై మోపరాదని, వేపర్లో ప్రమోషన్‌లకు మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. వెంటనే యూనియన్లను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు.తరువాత బస్టాండ్ సెంటర్ నుండి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండలం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కోటిపల్లి వద్ద వరద ఉధృతిని పరిశీలించిన తాసిల్దార్ మృత్యుంజయరావు.





**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 21:**కే గంగవరం మండలం కోటిపల్లి వద్ద వరద ఉధృతిని తాసిల్దార్ మృత్యుంజయరావు పరిశీలించినారు.గోదావరి వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉన్నది కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అదేవిధంగా కోటిపల్లి నుంచి సుందరపల్లి వెళ్లే మార్గంలో కుమ్మరి సవరం వద్ద ఏటి గట్టు కోతకు గురవుతున్న ప్రాంతాల్లో తాసిల్దార్ మృత్యుంజయరావు ఎస్సై జానీ భాష ఫ్లడ్ ఇన్స్పెక్టర్ పర్యటించి అక్కడ సర్వే కర్రలు ఇసుక బస్తాలు వేసి ఏటిగట్టు బలహీన పడకుండా చేయాలని సూచించారు. కే గంగవరం ఎస్సై జానీ భాష గోదావరి వరద ఉధృతి పెరిగింది కావున గోదావరిలో అనుమతి లేకుండా బోర్డులు నాటు పడవలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయానికి గోదావరి ఉధృతి పెరిగితే టోల్ ఫ్రీ నెంబర్, పునరావస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తాసిల్దార్ మృత్యుంజయరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. గోదావరి ఉధృతి పెరగడంతో లంక గ్రామాల్లో ఉండే పశు వులను సురక్షిత ప్రాంతాలకు తీసుకురావాలని అధికారులు సూచించారు.కే గంగవరం మండలం కోట, కోటిపల్లి, సుందరపల్లి, మసకపల్లి లంకలో ఉండే పశువులను, గొర్రెలను, మేకలను పడవలపై అధికారులు సహాయంతో గ్రామాల్లోని సురక్షిత ప్రాంతాలకు తీసుకువచ్చారు.

# వరద ప్రవాహిత ప్రాంతాలను పరిశీలించిన ఆర్డిఓ శ్రీకర్

గోదావరి వరద ఉధృత నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి..



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 21:**డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీ కర్ ఆత్రేయపురం తహశీల్దార్ టి. రాజేశ్వరరావు తో కలిసి గురువారం మధ్యాహ్నం బొబ్బర్లంక వద్ద గోదావరి వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరద పరిస్థితులు, ప్రమాదకర ప్రాంతాలు, తీరప్రాంత గ్రామాల భద్రతపై సమీక్ష నిర్వహించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు అందించారు.

ఆర్డీవో శ్రీకర్ మాట్లాడుతూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో అధికారులు నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. గ్రామ ప్రజలు అధికారులతో సహకరించాలని, ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే సమాచారం అందించాలని కోరారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్-ఎస్సై సుబ్రహ్మణ్యం

**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 21**

దేవరపల్లి,పల్లంట్ల గ్రామాలకు చెందిన కాలువ గట్టుపై పేకాట ఆడుతున్న ఎనిమిది వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం గురువారం విలేకరులకు తెలిపారు.ఆయన కథనం ప్రకారం కాలువ గట్టుపై కొంతమంది వ్యక్తులు రహస్య స్థలంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం వచ్చిందన్నారు.వెంటనే వెళ్లి దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 15,420 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# కొత్తూరు గ్రామానికి వంతెన కల్పించాలి - రైతుల విజ్ఞప్తి





**శంఖవరం, పెన్ పవర్,ఆగస్టు 21 :** శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామ ప్రజలు దశాబ్దాలుగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలేశ్వరం ప్రాజెక్టు నుండి విశాఖపట్నం వరకూ సాగు నీరు చేరే ఏలూరు కాలువ కొత్తూరు గ్రామం గుండా ప్రవహిస్తోంది. ఈ కాలువ త్రవ్వి దాదాపు 40 సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ గ్రామానికి వంతెన ఏర్పాటుచేయలేదు.గ్రామం అవతలప్రక్కన వందల ఎకరాల సాగుభూమి ఉండటంతో రైతులు రోజూ కష్టాలు పడుతున్నారు. వంతెన లేకపోవడంతో ప్రజలు, రైతులు కాలువపై వేసిన డామ్ మీదనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ముఖ్యంగా పెద్ద ఎత్తున వాహనాలు, ట్రాక్టర్లు, లారీల రాకపోకలతో ఆ డామ్ పూర్తిగా దెబ్బతింటోంది.ప్రస్తుతం డామ్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. గుంతలు ఏర్పడి, కింద ఉన్న కాంక్రీటు ఊడిపోయి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరగొచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వ కాలంలో కొత్తూరు గ్రామానికి జగనన్న కాలనీ కూడా కేటాయించినప్పటికీ, కాలనీకి రాకపోకలు సైతం ఈ ప్రమాదకరమైన డామ్ ద్వారానే సాగుతున్నాయి. వాహనాలు ఎక్కువ బరువు మోసినప్పుడు డామ్ మరింత దెబ్బతింటోందని ప్రజలు చెబుతున్నారు.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ముందుకు వచ్చి కొత్తూరు గ్రామానికి శాశ్వత వంతెన నిర్మించాల్సిన అవసరం ఉందని రైతులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. లేకపోతే రాకపోకలు పూర్తిగా ఆగిపోవడంతో పాటు, ఎప్పుడైనా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.ం

# స్వచ్ఛగ్రామ సాధనకోసం తల్లిదండ్రులను చైతన్య పరచాలి.

-విద్యార్థులకు సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర పిలుపు.






**కిర్లంపూడి, పెన్ పవర్,ఆగస్టు 21:** స్వచ్ఛ గ్రామ సాధన కోసం తమ తల్లిదండ్రులను చైతన్య పరచాలని సామాజిక ఉద్యమకారుడు,జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర విద్యార్థులకు పిలుపునిచ్చారు. కిర్లంపూడి మండలం తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ గ్రామం సాధన కోసం ప్రతి ఇంటి వద్ద తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేసి మన వీధిలోకి వచ్చే పంచాయతీ రిక్షాలకు,ట్రాక్టర్లకు అందించే విధంగా తమ కుటుంబ సభ్యులందరినీ విద్యార్థులు చైతన్య పరచాలని పాటంశెట్టి సూర్యచంద్ర విద్యార్థులను కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని, పరిసరాలు పరిశుభ్రత పాటించకపోతే తీవ్ర అనారోగ్యాలతో ఆర్థికంగా వెనకపడతామని సూర్యచంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ప్రతి ఒక్కరు స్వచ్ఛ గ్రామ సాధన కోసం కృషి చేయాలని కోరారు. ప్రతి పరీక్షలోనూ దశల వారిగా అభివృద్ధి సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు,చిన్న మార్పుతోనే పెద్ద విజయాలు సాధ్యమని విద్యార్థులను పాటంశెట్టి సూర్యచంద్ర చైతన్యపరిచారు

# కాకినాడ జిల్లా అగ్రి రిటైల్ డీలర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక





**- చైర్మన్ గా నూని వెంకటేశ్వర చౌదరి**
**- రైతులకు ఉపయోగకరంగా అగ్రి రిటైల్ డీలర్స్ అసోసియేషన్ సేవలు**

**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్,ఆగస్టు 21 :** కాకినాడ జిల్లా అసోసియేషన్ మరియు కార్యవర్గ సభ్యుల ఎన్నిక స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ గా నూని వెంకటేశ్వర చౌదరి, జిల్లాలో వివిధ మండలాల నుండి కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడానికి రిటైల్ డీలర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని రాష్ట్ర పెర్టిలైజర్స్, పెస్టి సైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వజ్రాల వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫెర్టిలైజర్స్ ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు క్షేత్రస్థాయిలో సేవలు అందించడానికి ఫెర్టిలైజర్స్ డీలర్స్ కృషి చేస్తున్నారని అదే సమయంలో అనేక చిన్నచిన్న ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి డీలర్స్ కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా సైన్స్ అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం యూరియా స్థానంలో నానో యూరియా అందుబాటులో ఉందని రైతులు అవగాహన పెంచుకొని నానో యూరియాను ఉపయోగించుకోవాలని అదే సమయంలో ఆందోళన చెందకుండా యూరియా ఎంత మేరకు అవసరం ఉందో అంత మేరకు కొనుగోలు చేస్తే ఇతర రైతులకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. యూరియాతోపాటు లింక్ గా కొన్ని పురుగుమందును సైతం కొనవలసిన పరిస్థితి ప్రస్తుతం ఉందని, దీనివలన రైతులు అదే సందర్భంలో డీలర్స్ కూడా కొన్ని ఇబ్బందులకు గురి అవుతున్నారని, దీనిపై ఆయా కంపెనీల యాజమాన్యాలతో దేశ స్థాయిలో చర్చలు జరపవలసిన అవసరం ఉందని దీనికి తమ అసోసియేషన్ తరపున వివిధ మార్గాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీకు అభినందనలు తెలిపారు. నూతనంగా జిల్లా అసోసియేషన్ చైర్మన్గా ఎన్నికైన నూని వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ తనను జిల్లా అసోసియేషన్ చైర్మన్ గా ఎన్నుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అదే సమయంలో కార్యవర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు విరివిగా సేవలందించడానికి వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో ముందుకు వెళదామని పిలుపునిచ్చారు.కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ శాఖ జె డి ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు సేవలందించడానికి డిస్ట్రిబ్యూటర్లు క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున కృషి చేయవలసిన అవసరం ఉందని, అదేవిధంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పురుగుమందులు, యూరియా లాంటివి అందించడానికి డిస్ట్రిబ్యూటర్స్ చిత్తశుద్ధి తో పనిచేయాలని కోరారు. నూతన కమిటీ కు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు విజయ్ కుమార్ ను డీలర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన కమిటీ తో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫెర్టిలైజర్స్,పెస్టి సైడ్స్ అధ్యక్షులు చంద్రు గోవిందరాజు,రాష్ట్ర పెర్టిలైజర్స్, పెస్టి సైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొంతు శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కొత్తపల్లి విజయ్ కుమార్, వివిధ మండలాల డీలర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్థంబాన్ని ఢీకొన్న ట్రాక్టర్,ఒకరు మృతి



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 21 :** విద్యుత్ స్థంబాన్ని అతివేగంతో ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు.ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కోరుకొండ మండలం కాపవరం గ్రామం నుండి %ఞూ39 నూ% 7479 నంబరుగల ట్రాక్టర్ ఇటుకల లోడుతో బయలుదేరి మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో దిగుమతి చేసి తిరిగి కాపవరం వెళుతుండగా మార్గమధ్యంలో రంప ఎర్రంపాలెం గ్రామ శివారులో డ్రైవర్ అతివేగంతో వచ్చి విద్యుత్ స్తంబాన్ని ఢీకొన్నాడు.దీంతో విద్యుత్ స్థంబం విరిగి ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న కాపవరం గ్రామానికి చెందిన గొట్టాల శివపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివిఎస్వీ పవన్ కుమార్ తెలిపారు

# గోదావరి,శబరి నదులు ఉగ్రరూపం







**-భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ**
**-వరద ప్రభావంతో ప్రజల్లో ఆందోళన**

**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 20.** అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి,శబరి పరివాహక ప్రాంతాలైన తెలంగాణ, చతిస్గడ్,ఒరిస్సా నదులలో వరద ప్రవాహం ఉరకలెత్తుతోంది.విలీన మండలాల ప్రజల్లో ఎగువన కురుస్తున్న వర్షాలకు,పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ మూలంగా ప్రజల్లో ఆందోళన మొదలైంది.కూనవరం మండలంలో వరద ప్రభావానికి కొండ్రాజుపేట కాజ్ వే పై వరద నీరు ప్రవహిస్తుంది.కూనవరం నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి మురుమూరు వద్ద వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంద్రాజుపల్లి కల్వర్టుపై వరద నీరు చేరి మండల కేంద్రానికి ప్రజలు రాకుండా సుమారు 50 గ్రామాలు రాకపోకలు స్తంభించిపోయాయి.భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఉదయం 6 గంటలకు 50.30 అడుగులు వద్ద వరద ప్రవహిస్తు,సాయంత్రం 8 గంటలకు 51.90 అడుగుల కు చేరుకొని వరద ప్రవహిస్తుంది. రెండవ ప్రమాద హెచ్చరిక అధికారులు జారీచేశారు. మండల కేంద్రంలోని భాస్కర కాలనీ,గిన్నెల బజార్,చేపల బజార్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తాసిల్దార్ కే శ్రీనివాస్ అన్నారు. ముందస్తుగా ప్రజలను రీ హ్యాబిటేషన్ సెంటర్లకు పంపించడంలో స్థానిక సర్పంచ్ హేమంత్ గాంధీ,తాసిల్దార్ కే శ్రీనివాస్ చొరవ వలన టేకులబోరు నందు ఏర్పాటు చేసిన రిహాబిటేషన్ సెంటర్ నందు 120 మంది,కూనవరం సచివాలయం నందు 50 మంది ఉన్నారు.రీ హ్యాబిటేషన్ సెంటర్ నందు ఉన్న వారికి నిత్యవసర వస్తువులను అందించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎవరు ఆందోళన చెందవద్దని సర్పంచ్,తాసిల్దార్ అన్నారు.మండల కేంద్రంలోని ప్రజలు రాష్ట్రానికి మేము చేస్తున్న త్యాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ మూలంగా తరచూ వస్తున్న గోదావరి వరదల కారణంగా నష్టపోకుండా మమ్ములను విముక్తులను చేయాలని,పోలవరం ప్రాజెక్టు మూలంగా ముంపు గురవుతున్న మమ్ములను గుర్తించి మాకు రావలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, నివాసయోగ్యమైన గృహాలను కట్టి ఇవ్వాలని ముంపు ప్రజలు కోరుతున్నారు.

# వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి-ఆర్డీఓ సుష్మిత





**గోపాలపురం, పెన్ పవర్ ఆగస్టు 21:** వాతావరణంలో మార్పుల కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎవ్వరూ నష్టపోకుండా అధికారులు చూడాలని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుష్మిత అధికారులను ఆదేశించారు.గురువారం ఆర్డీఓ నల్లజర్ల మండలం గండేపల్లి గ్రామ సమీపంలోని ఎర్ర కాలువ పరివాహక ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వర్షాల కారణంగా వరద నీరు పంట పొలాలను ముంచెత్తకుండా చూడాలన్నారు.ఎక్కడైనా ముంపుకు గురైతే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం రాకుండా చూడాలని రైతులకు పలు సూచనలు సలహాలు అందించాలన్నారు.వరద నీరు ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేయాలని ఆదేశించారు.రెవెన్యూ,పోలీస్,ఆరోగ్య,వ్యవసాయ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.పరిస్థితి ప్రమాదకరంగా ఉంటే ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయ సహకారాలు కూడా తీసుకోవాలన్నారు.కాలువల గట్లు పటిష్టతను పరిశీలించాలన్నారు.గట్లు బలహీనంగా ఉన్న చోట పటిష్టం చేసే ఏర్పాట్లు చూడాలన్నారు.ఆమె వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వీరమ్మ కుంట సంపద కేంద్రం అలంకారప్రాయం

**ఏలూరు ఆగస్టు 21 పెన్ పవర్:** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రారంభించిన చెత్త సంపద కేంద్రాలు నేడు అలంకారప్రాయంగా మారాయి. 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పంచాయితీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో చెత్త సంపద ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇళ్ల నుంచి వచ్చే తడి పొడి వ్యర్థాలను వేరుచేసి వర్మి కంపోస్ట్ తయారు చేసే ఉద్దేశంతో వీటికి నిధులు సమకూర్చింది. పెదపాడు మండలంలో 20 గ్రామాల్లో షెడ్లను నిర్మించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక షెడ్ల నిర్వహణను గాలికి వదిలేశారు. మండల పరిధిలోని సకల కొత్తపల్లి,వసంతవాడ, వీరమ్మ కుంట, కొత్తగూడెం, కొత్త ముప్పర్రు, కొత్తూరు,గ్రామాలతో పాటు మరో 16 గ్రామాల్లో ఈ షెడ్ల ను నిర్మించారు. వీటిని వినియోగంలోకి తేవడంలో పాలకులు నిర్లక్ష్యం చూపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ నిర్ణయం మేరకు చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించినా, అధికారుల పర్యవేక్షణాలేమితో అవి క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

-వీరమ్మ కుంట గ్రామంలో సుమారు రూ. ఐదు లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రం మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారింది. సంపత్ కేంద్రానికి విద్యుత్, నీళ్ల సదుపాయం కల్పించకపోవడంతో సంవత్సరాల తరబడి సంపద తయారీకి నోచుకోవడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను సంప్రద కేంద్రానికి తరలించకుండా రోడ్ల వెంబడి పడేస్తున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకుని సంపద కేంద్రానికి మౌలిక వసతులు కల్పించి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి సంపద సృష్టించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



# జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

## కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 21:** వివిధ ప్రభుత్వ శాఖలు ప్రభుత్వ పథకాలు అమలు తీరులో ఉత్తమ ప్రతిభను కనపరుస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లాస్థాయి అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శ కె విజయానంద్ 26 జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జలవనరుల సంరక్షణ భూగర్భ జలాల పెంపు త్రాగునీటి వనరులు అభివృద్ధి, ప్రతి నీటి బొట్టును ఒడిసిపడుతూ నీటి వినియోగాన్ని ,ప్రతి శాఖ డాక్యుమెంట్లను అప్లోడ్ చేయడం స్వామిత్వ సర్వే ఈనెల 23 మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నిర్వ హణ,పాజిటివ్ పబ్లిక్ సంతృప్తి స్థాయిల పురోగతిపై జిల్లాల వారీగా. సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రాగునీటి చెరువుల అభివృద్ధి భూగర్భ జలాల పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ దస్త్రాలను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తూ కీప్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్(కెపిఐ) డిజిట లైజేషన్ కొరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.. నిర్దేశిత గడువు నాటికి కేపిఐ పనితీరు నివేదికలను ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. నరేగా ద్వారా భూగర్భ జలాల పెంపుకు చర్యలు గైకొనాల న్నారు. స్వర్ణాంధ్ర విజన్ మానిటరింగ్ డాష్ బోర్డు నందు జిల్లా చెందిన అభివృద్ధి అంశాలను అప్లోడ్ చేయాలన్నారు. 8 వ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల ఇతివృత్తంతో మురికి నీటి కాలువలు శుభ్రం చేయడం నీటి నిల్వలు నివారణ కీటక ఉత్పత్తులపై నియంత్రణ చర్యలు వంటి అంశాలపై గ్రామస్థాయిలోఅవగాహన పెంపొందించాలన్నారు. ప్రతి అంశంలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ ప్రజా సంతృప్తి కొలమానం గా పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.స్వామిత్వ సర్వే గ్రామకంఠల లో 4 దశలలో గ్రౌండ్ ట్రూత్కింగ్ గ్రౌండ్ వాల్యూయేషన్ వ్యక్తరై జేషన్ 13 నోటిఫికేషన్ ప్రక్రియలను దశలవారీగా నిర్వహిస్తూ యాజమాన్యాలకు భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేని డిజిటలైజేషన్ చేసిన హక్కుపత్రాలను అందించాలన్నారు. జిల్లా కోర్టులలో ఏపీపి ఏజీపీ జీపీ పోస్టులలో అర్హులైన అడ్వకేట్లను ఎంపిక చేసి ఖాళీలను జిల్లా జడ్జిల సమన్వయం తో రెవెన్యూ అధికారులు ఆయా పోస్టులలో ఇన్చార్జిలను నియమించేందు కు కృషి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి పాఠశాలలకు గ్రేడింగులు ఇస్తూ స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను జిల్లాకు 55 కేటాయించడం జరిగిందని, నిర్దేశిత స్థాయిలలో పరిశుభ్రత అంశాల పారామీటర్లను సెల్ఫ్ అసెస్మెంట్ చేస్తూ అక్టోబర్ 2 తేదీ గాంధీ జయంతి రోజున జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో అవార్డులను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సంతృప్తి లక్ష్యంగా విద్యుత్ సరఫరా వైద్య సేవలు, నిత్యవసర వస్తువులు సరఫరా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు దీపం 2 ఉచిత సిలిండర్లు సరఫరా వంటి అంశాలపై ప్రజా సంతృప్తిని మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి, డిపిఓ శాంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ ఉదయభాస్కర్, భూగర్భ గనుల శాఖ ఏడి ఎల్ వంశీధర్ రెడ్డి,ఏపీ ఈపీడీసీ ఎల్ ఎస్సీ బి రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్లు రంగారావు, నిర్మల్ కుమార్, రవి వర్మ,తదితరులు పాల్గొన్నారు.

# నేడు తంటికొండలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 21 :** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తంటికొండ గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం నందు శ్రావణమాసం సంధర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిపించనున్నట్లు ఆలయ ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, కార్యనిర్వహణాధికారి వడ్డాది సత్యనారాయణ తెలిపారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని లక్ష్మీదేవి కటాక్షం పొందగలరని వారు కోరారు.

# కె గంగవరంలో వేణుగోపాల స్వామి ఆలయంలో నూతన ట్రస్ట్ బోర్డ్



**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 21:** మండల కేంద్రమైన కే.గంగవరం గ్రామంలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం నూతన ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు జరిగింది. ఆలయ ఈవో వి. బాలకృష్ణ, జి. భీమశంకరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దింశెట్టి నరసమ్మూర్తిని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా ఎంపిక చేశారు.అలాగే సభ్యులుగా తుట్టపు వెంకటనారాయణ, జాస్తి సూర్యనారాయణ మూర్తి, వినుకొండ వెంకటరాజు, బాదంపూడి నాగేశ్వరరావు, కొల్లి శ్రీ దుర్గ కృష్ణమూర్తి, అనుసూరి శ్రీలక్ష్మి, భీమరాజు వెంకట సూర్య మాణిక్యం, గుత్తుల సత్యనారాయణమ్మ, పెద్దింటి రామణాచార్యులు ఎన్నుకోబడ్డారు.నూతనంగా ఎన్నికైన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం లో ఏసీబీ దాడులు.

## లంచం డిమాండ్ చేసి పట్టుబడిన నగర పంచాయతీ కమిషనర్, డాటా ఎంట్రీ ఆపరేటర్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 21:** రాజమండ్రికి చెందిన ఏసీబీ అధికారులు గురువారం ఏలేశ్వరం లో దాడులు నిర్వహించారు. నగర పంచాయతీ సివిల్ కాంట్రాక్టర్ రాజబాబుకు చెల్లించాల్సిన బిల్లులను ఇవ్వకుండా నగర పంచాయతీ కమిషనర్ ఎం సత్యనారాయణ, డాటా ఎంట్రీ ఆపరేటర్ జి అరుణాచలం ద్వారా లంచం డిమాండ్ చేయడంతో సదరు సివిల్ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో రాజమండ్రి ఏసీబీ డి.ఎస్.పి. ఎం కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు గురువారం రంగ ప్రవేశం చేశారు. ఈ విషయమై ఏసీబీ డిఎస్పి ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు విషయాలు వెల్లడించారు. నగర పంచాయతీ సివిల్ కాంట్రాక్టర్ రాజబాబు దిబ్బల పాలెం కృష్ణాలయం వీధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని 2021 జూలైలో ప్రారంభించి 2023 నవంబర్లో పూర్తి చేశారు. నగర పంచాయతీ కమిషనర్ అప్పట్లో సదరు కాంట్రాక్టర్కు 56 లక్షలు రిలీజ్ చేశారు. ఆ వర్క్ కు సంబంధించి ఇంకా 7 లక్షల, 34 వేల 925 రూపాయలు నగర పంచాయతీ అధికారులు చెల్లించాల్సి ఉంది. అలాగే 2017లో సిసి రోడ్డు నిర్మించాడు. ఈ పని నిమిత్తం ఈ ఎండి రూపంలో ఒక లక్ష 5వేల రూపాయలు కాంట్రాక్టర్కు ఇవ్వాల్సి ఉంది. రెండు పనుల నిమిత్తం పెండింగ్ లో ఉన్న ఈ అమౌంట్ను క్లియర్ చేయడానికి కమిషనర్ సత్యనారాయణ 3 % లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు 23 వేల రూపాయలు లంచంగా ఇవ్వమని డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్ రాజబాబుకు లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ ని ఆశ్రయించాడు అని డిఎస్పి వెల్లడించారు. నగర పంచాయతీ ఆఫీసులో డాటా ఎంట్రీ ఆపరేటర్ గా పనిచేస్తున్న జి అరుణాచలం ద్వారా 23 వేల రూపాయల లంచం కమిషనర్ తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు వారిద్దరిని అదుపులోకి తీసుకొన్నామని, ప్రొసీజర్ పూర్తయిన తర్వాత వారిద్దరిని జ్యూడిషియల్ రిమాండ్ పంపడం జరుగుతుందని రాజమండ్రి ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ ఏసీబీ దాడుల్లో రాజమండ్రి ఏసీబీ ఇన్స్పెక్టర్లు వై. సతీష్, ఎన్ వి భాస్కరరావు, వి వి. వాసు కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. కాగా డీఎస్పీ మాట్లాడుతూ లంచగొండితనం రూపుమాపాలంటే ప్రజల సహకారం కావాలని, ఎవరైనా లంచం అడిగితే రాజమండ్రి ఏసీబీ డిఎస్పి సెల్ నెంబర్: 9440 446 160, సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. వి. భాస్కర్ రావు సెల్ నెంబర్: 9440 446 161 లకు ఫోన్ చేసి తెలపాలి అని, లేదా స్వయంగా ఆఫీసుకు వచ్చి నేరుగా కలవచ్చన్నారు. వివరాలు అందించిన వారికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డిఎస్పి అన్నారు.

# ఘనంగా పైడితల్లి అమ్మవారికి సారే సమర్పణ.





**కిర్లంపూడి, పెన్ పవర్ ఆగస్టు 21:** కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని జగపతినగరం కాపుల రామాలయం కమిటీ ప్రెసిడెంట్ లంక మూర్తి ఆధ్వర్యంలో గురువారం సారె సమర్పణ కార్యక్రమాన్ని ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మహిళలు అమ్మవారికి లంక మూర్తి ఆధ్వర్యంలో సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లంక మూర్తి మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారికి కాపులు రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సారెను సమర్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

# నేడు ఏలేశ్వరం లో జాతీయ వర్క్ షాప్ .




**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 21:** స్థానిక ది లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఫంక్షన్ హాల్లో జాతీయ వర్క్ షాప్ ను శుక్రవారం నిర్వహించ నున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జాతీయ వర్క్ షాప్ కు సంబంధించిన వివరాలను ప్రిన్సిపాల్ సునీత గురువారం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ప్రధానమంత్రి ఉచ్ఛతర శిక్షా అభియాన్ పథకంలో భాగంగా ఎంట్రీవిష్టా అనే అంశం పై జాతీయ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని,ఈ వర్క్ షాప్ ద్వారా ఉద్యోగాలు అడిగే స్థితిలో ఉండకూడదని ప్రతి ఒక్కరు వ్యవస్థాపకులుగా ఎదగాలని, తామే మరో పదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థితిలోకి తీసుకురావాలని ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో వివిద ప్రాంతాల నుండి రిసోర్స్ పర్సన్స్ కొత్త కొత్త స్టార్ట్ అప్స్ గూర్చి విద్యార్థులకు తెలియజేస్తారని అన్నారు .ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ కన్వీనర్ గా డా.ప్రయాగ మూర్తి ప్రగడ, కె.సురేశ్,ఆర్గనైజింగ్ సెక్రటరీస్ గా కె. వేంకటేశ్వర రావు,కె.రామరావు వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

# అడ్డతీగల ఆశ్రమ బాలికల హై స్కూల్లో విద్యార్థులతో పనులు చేయిస్తున్న స్కూల్ యాజమాన్యం

అల్లూరి జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు ..





**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు 21:** అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో వివిధ పనులు స్కూల్ యాజమాన్యం చేయించారని తమ దృష్టికి వచ్చిందని, చదువుకోవలసిన పిల్లలతో ఇలా పనులు చేయించి వారి విద్య సమయాన్ని నాశనం చేస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల. బాబురావు ఆరోపించారు .

ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పనులు చేయటానికి సిబ్బంది లేరా అని ప్రశ్నించారు. ఆఫీస్ రూమ్ పిల్లలతో ఊడిపించటం , పాఠశాల సరుకులు పిల్లలతో మొయించటం , చెత్త చెదారం పిల్లలతో పారేయించటం , గార్డెన్ లో గడ్డి పీకించటం లాంటి పనులు చేయించటానికి పిల్లలను స్కూల్ కి పంపించలేదని, వారు బాగా చదువుకుని ప్రయోజకులు అవ్వాలనే ఉద్దేశ్యంతో పంపించారని, అయితే స్కూల్ యాజమాన్యం పిల్లల యొక్క విలువైన విద్య సమయాన్ని ఇలా పాడుచేసి నాణ్యమైన విద్యకు దూరం చేయటం అంటే వారి జీవితాన్ని నాశనం చేయటంతో సమానమని అన్నారు.

. స్కూల్ యాజమాన్యంపై స్కూల్ నిర్వహణ విధానంపై చాలా ఆరోపణలు వస్తున్నాయని, అలాగే ఈ సంఘటనలపై విచారణ జరిపి స్కూల్ యాజమాన్యంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు మోడిదా.నూకరాజు డివిజన్ కోఆర్డినేటర్ పీత. ప్రసాద్ పాల్గొన్నారు.

# యువత ప్రాణాలపైకి తీసుకొచ్చుకోవద్దు

గంగవరం ఎస్ఐ వెంకటేష్

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21:** మద్యం సేవించి యువత ద్విచక్ర వాహనాలను అధిక స్పీడుతో నడుపుతున్నారని దీంతో మృత్యువాత పడుతున్నారని ప్రాణాల పైకి తెచ్చుకోవద్దని గంగవరం ఎస్సై వెంకటేష్ సూచించారు. గురువారం రాత్రి గంగవరం పి. పి. పి పాలెం రహదారి లో యువకులతో సమావేశం నిర్వహించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సారాయి వంటి నిషేధిత పదార్థాలను వాడొద్దని అలాగే వాటి రవాణా కు సహకరించవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినట్లయితే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలన్నారు. యువత ఎటువంటి రిస్కు తీసుకోవద్దని సూచించారు. గంగవరం పోలీసు సిబ్బంది ఉన్నారు.



# గోపన్నపాలెంలో పారిశుద్ధ్యం అధ్వానం





**-పాఠశాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం**

**ఏలూరు ఆగస్టు 21 పెన్ పవర్:** దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలో పేగవరం ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురుగు రోడ్లపైనే ప్రవహిస్తున్నా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో వేగవరం ప్రాంత వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిధిలోని వేగవరం మండల పరిషత్ పాఠశాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొందని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. కాలనీలో డ్రైనేజీలలో మురుగు పారక రోడ్లపైనే మురుగు ప్రవహిస్తూ ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలలో మురుగు పాలకపోవడంతో వర్షపు నీటితో కూడిన మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని, దీనివలన వర్షపు నీటితో దోమలు విజృంభించి దుర్వాసనతో పాటు అపరిశుభ్రవాతావరణం నెలకు ఉందని పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామంలో చెత్త చెదాలను తొలగించడానికి వారానికి ఒకరోజు మాత్రమే ట్రాక్టర్ వస్తోందని. పంచాయతీ అధికారుల క్షేత్రస్థాయి వేగవరం లో డ్రైనేజీలు దుర్గంధంతో దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని ఆరోపిస్తున్నారు. వేగవరం లో ఫాగింగ్ వంటి దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలనీలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే రోగాల బారిన పడతానేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వేగవరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వేగవరం వాసులు కోరుతున్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి, ఆన్లైన్లో అనుమతులు

- జీకే వీధి సిఐ వరప్రసాద్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 21:** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మండపాల ఏర్పాటుకు సంబంధించి ఈసారి ఆన్లైన్ ద్వారా అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని జీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ తెలిపారు. వినాయక మండపాల అనుమతుల కోసం వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన అనంతరం, సంబంధిత పోలీస్ అధికారులు మండప స్థలాన్ని పరిశీలించి, క్యూఆర్ కోడ్ తో కూడిన ఎన్వోసీ (నిరభ్యంతర పత్రం)ను జారీ చేస్తారని వివరించారు. మండపాలను రోడ్డు మధ్యలో కాకుండా, ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా,రోడ్ల పక్కన ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలు అందుబాటులో ఉండే వాలంటీర్లను నియమించాలని, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సమస్యాత్మక మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎన్వోసీ మంజూరుకు పోలీస్ శాఖ ఎటువంటి రుసుములు వసూలు చేయదు అని స్పష్టం చేశారు. వినాయక చవితిని ఇతర మతస్తులకు ఇబ్బంది కలగకుండా,సమన్వయంతో జరుపుకోవాలని, మండపాల నిర్వహణలో కమిటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడం నిషేధించబడిందని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన వారికి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం...!

- మర్రిపాలెం కళాశాల ప్రిన్సిపాల్ సుధా వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 21:** మండలంలోనిమర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశం కొరకు ఇంటర్ లో ఉత్తీర్ణులైన విద్యార్థినుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె సుధా తెలియజేశారు. మర్రిపాలెం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో బిఏ (ఎకనామిక్స్), బీకాం( కంప్యూటర్ అప్లికేషన్స్), బీ.ఎస్సీ ( ఫిజిక్స్,), బీ.ఎస్సీ (జూలజీ), బీ.ఎస్సీ (మ్యాథ్స్) గ్రూప్స్ కలవు. ఈ కళాశాల ఆవరణ లో ఉచిత హాస్టల్ సదుపాయం కలదు. కళాశాలలో అనుభవైజ్ఞులైన ఉపన్యాసకుల బృందం చే బోధన చేయబడుతుంది. కావున ఇంటర్ ఉత్తరులైన విద్యార్థునులు పైన తెలిపిన గ్రూపులకు గాను ముందుగా ఓఏ ఎం డి సి వెబ్ సైట్ నందు ఆన్లైన్ లో ఈ నెల 20 నుండి 26 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ సుధా తెలిపారు.

## రేపే పాడేరు ఎమ్మెల్యే కొయ్యూరు రాక...!

- జడ్పీ గెస్ట్ హౌస్ లో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :** ఈ నెల 23న కొయ్యూరు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు రానున్నట్లు వైసీపీ పార్టీ మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... శనివారం వైసిపి కార్యకర్తలతో "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" అనే కార్యక్రమం పై వైసిపి కార్యకర్తలతో జడ్పీ గెస్ట్ హౌస్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు ముఖ్య కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ గా డప్పాడి వెంకటరమణ ప్రమాణ స్వీకరణ

మాజీ ఎమ్మెల్యే, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ పలువురు హాజరు





**పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 21:** కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత దాదాపుగా అన్నిరకాల కేటగిరీల సంస్థగతుల చైర్మన్ పదవులు, డైరెక్టర్ లు భర్తీ చేస్తూ వచ్చింది. అందులో భాగంగానే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్లతో పాటు డైరెక్టర్ లను ప్రకటించిన విషయం తెలిసిందే...! వారి ప్రమాణ స్వీకరణ కార్యక్రమలు ఇప్పటికే డివిజన్ లో ప్రారంభం కావడంతో అందులో భాగంగానే నేడు...

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ గా డప్పాడి వెంకటరమణ ప్రమాణ గురువారం స్వీకరణ చేశారు. ఈ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే పాడేరు నియోజకవర్గం ఇంచార్జీ గిడ్డి ఈశ్వరి పర్యవేక్షణలో జరిగింది. ఆమె దగ్గరుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందించి చైర్మన్ తో పాటు డైరెక్టర్ లైనా మర్రి కొండబాబు, వంపూరు రమేష్ లను కూడా ప్రమణ స్వీకరణ చేసే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ....పార్టీ కోసం, అహర్నిశలు కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని , అనేక సంక్షేమ కార్యక్రమాలతో అలాగే అభివృద్ధి దిశగా ముందుకు దూసుకు పోయే విధంగా సాగుతుందని, శ్రీనిధి పథకం ద్వారా స్త్రీలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీఠం వేసిందని అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జానపద కళాల మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరు . గంగులయ్య, బి సి సెల్ రాష్ట్ర ఉప అధ్యక్షులు గోవింద్' మాస్టర్, పాడేరు ఎం పి పి రత్న కుమారి, శివ కుమార్ (వైఎస్ ఎం పి పి) కిముడు కళ్యాణం, దొరబాబు, నాగేశ్వరరావు, రొబ్బి రాము, ఉషారాణి,పలువురు హాజరైనారు.

## అనధికార లే-అవుట్లు, అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలి

జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ





**పాడేరు, పెన్ పవర్,ఆగస్టు 21:** అనధికార లే-అవుట్లు, అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు.

జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశాల మేరకు, పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో గురువారం ఉదయం టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం మరియు పంచాయతీ రాజ్ %డ% గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు లే-అవుట్లు మరియు భవన నిర్మాణ అనుమతులు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని 43%ూ% గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి కొంతమంది అనధికార లే-అవుట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, గ్రామ పంచాయతీలలో అనుమతులు పొందకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వాటిని నియంత్రించడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్య వైఖరి అవలంభించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా, నిర్ణీత ప్రమాణాలతో అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేయకుండా, సామాజిక అవసరాలకు లే అవుట్ మొత్తం స్థలంలో 10 శాతం స్థలం గ్రామ పంచాయతీలకు కేటాయించకుండా ఏర్పాటు చేసిన లే అవుట్ల పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చామంతి , అసిస్టెంట్ డైరెక్టర్ శ్రావణి, డి.టి.సి. పి.ఓ రామానాయుడు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామకంఠం భూములలో %+%౦2 లేదా 9 మీటర్ల ఎత్తు వరకూ రెవెన్యూ భూములలో %+%౦3 లేదా13 మీటర్ల ఎత్తు వరకూ భవన నిర్మాణాలు చేయవచ్చని, భవన నిర్మాణం చేపట్టే యజమానులు భవనం చుట్టూ సెట్ బ్యాక్స్ ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో బిల్డింగ్ రెగ్యులేషన్ స్కీమ్ అమలులో లేదని, వాణిజ్య సముదాయాల నుండి నిర్దేశించిన ఫీజులు వసూలు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి చంద్ర శేఖర్ ,గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి. యస్. కుమార్, జిల్లా మలేరియా అధికారి తులసి, గ్రామీణ నీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు మరియు %దీూచీూ% ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు ప్రజారోగ్యం, త్రాగునీటి సరఫరా, సచివాలయాల నిర్వహణ, పి4 పథకం , నెట్ వర్క్ అంశాలపై శిక్షణ ఇచ్చారు.